www.prajanaava.in
Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 10 | ఆదివారం | 9 ఆగస్టు, 2026



## యువతే దేశానికి బలం

వారిని ‘చక్రవ్యూహం’లో బంధించారు
విద్య ఉన్నా కొలువుల్లేవు
పేపర్ లీకులు, నిరుద్యోగంతో భవిష్యత్తుకు ముప్పు
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

6

దేశ యువతే భారత్‌కు అతిపెద్ద బలమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. యువత సృష్టించే డేటా 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థకు కీలకమవుతుందని పేర్కొన్నారు. అయితే యువత సామర్థ్యం, వారు సృష్టించే డేటా ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాలు పెద్ద పారిశ్రామిక సంస్థలకు చేరుతున్నాయని ఆరోపించారు. యువతను ఓ ‘చక్రవ్యూహం’లో బంధించారని విమర్శించారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో నిర్వహించిన ‘ఛాత్రోంకీ గూంజ్’ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అమెరికా, చైనా, రష్యాల గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్నా.. భారత యువతకు ప్రపంచంలో ఎవరూ సాటిరారని రాహుల్ అన్నారు.



## జీవితమంటే లీడర్ బోర్డు కాదు

ఇతరులతో కాదు.. నీతో నువ్వే పోటీ పడాలి

- విద్యారంగంలో అమ్మాయిల ప్రాతినిధ్యం పెరగాలి
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభను కనబరచడంలో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో పతకాలు, అవార్డులు అందుకున్న వారిలో మరింత మంది అమ్మాయిలు ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. శనివారం జరిగిన ఐఐటీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా ప్రభావంతో ఇతరులతో తమ జీతాలు, ఉద్యోగాలు, స్టార్టప్ విజయాలను పోల్చుకోవద్దని మోదీ విద్యార్థులకు సూచించారు. ఇతరులతో పోల్చుకోవడంతో అనవసరమైన ఒత్తిడి పెరుగుతుందని, మానసిక, శారీరక ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ స్వీయ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చెప్పారు. ‘జీవితం లీడర్‌బోర్డు కాదు. నిజమైన పోటీ ఇతరులతో కాదు.. నీతోనే’ అని తరువాయి 2లో..

## మోదీకి జేడీ వాన్స్ ఫోన్

- వాణిజ్యం, రక్షణ, ఖనిజాల రంగాల్లో సహకారంపై చర్చ
- ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా అభిప్రాయాలు పంచుకున్న నేతలు
- ద్వైపాక్షిక భాగస్వామ్య బలోపేతానికి కట్టుబడి ఉన్నామన్న అగ్రరాజ్యం

6

## మెటా హోదాపై కేంద్రం పరిశీలన

- ‘ఎవరికి ఏ కంటెంట్ చూపించాలో’ నిర్ణయిస్తే పబ్లిషర్‌గా పరిగణించాలా?
- రెకమండేషన్ సిస్టం, పెయిడ్ ప్రమోషన్, డీప్‌ఫేక్‌లపై ప్రశ్నలు



## నేడు నర్సంపేటకు గులాబీ బాస్

- నల్లబెల్లిలో పెద్ది కుటుంబసభ్యులను పరామర్శించనున్న కేసీఆర్
- రూ.2.25 కోట్ల సాయం అందించనున్న పార్టీ అధినేత
- ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి.. తల్లి అమృతమ్మకు రూ.25 లక్షలు
- సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామన్న మాజీ సీఎం

2





## యూపీఐ ఫ్రీ!

వినియోగదారుల నుంచి ఎలాంటి లావాదేవీ రుసుము వసూలు చేయం
మర్చంట్ లావాదేవీల్లోనూ అత్యధికం ఉచితమే
భవిష్యత్తులో ఎండీఆర్ వచ్చినా పరిమిత లావాదేవీలకే నామమాత్రపు రుసుము: కేంద్రం

2

**న్యూఢిల్లీ:** యూపీఐ లావాదేవీలపై రుసుములు విధించనున్నారన్న ఊహాగానాలకు కేంద్ర ప్రభుత్వం తెరదించింది. యూపీఐ వినియోగించే సాధారణ ప్రజల నుంచి ఎలాంటి లావాదేవీ చార్జీలు వసూలు చేయబోమని శనివారం స్పష్టం చేసింది. మర్చంట్లకు సంబంధించిన లావాదేవీల్లోనూ అత్యధికం ఉచితంగానే కొనసాగుతాయని తెలిపింది. భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ప్రవేశపెట్టినా.. నిర్దిష్ట పరిమితికి మించిన కొద్దిపాటి లావాదేవీలకే నామమాత్రపు రుసుము వర్తిస్తుందని పేర్కొంది. ఆ రుసుము సాధారణ డెబిట్, క్రెడిట్ కార్డుల ఎండీఆర్ కంటే తక్కువగా ఉంటుందని వివరించింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్–2007లోని సెక్షన్ 10ఏకు ప్రతిపాదించిన సవరణతో యూపీఐపై చార్జీలు విధించనున్నారన్న చర్చ మొదలైంది. అయితే ఈ సవరణ కేవలం రుసుములు విధించేందుకు అవకాశం కల్పించే నిబంధన మాత్రమేనని, స్వయంగా ఎలాంటి ఎండీఆర్‌ను విధించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. పార్లమెంట్ ట్యాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్లు–2026ను ఆమోదించిన అనంతరం ఎండీఆర్ విధించాలా? వద్దా? అన్న అంశాన్ని ఎన్‌పీసీఐ ఆధ్వర్యంలోని ‘యూపీఐ అండ్ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ’ నిర్ణయిస్తుందని తెలిపింది.

### పీ2పీ లావాదేవీలు పూర్తిగా ఉచితం

వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే (పీ2పీ) యూపీఐ లావాదేవీలన్నీ ఎప్పటిలాగే ఉచితంగానే కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. మర్చంట్ చెల్లింపుల్లోనూ ఎండీఆర్ అమలైతే అది అన్ని లావాదేవీలకు కాకుండా నిర్దిష్ట పరిమితికి మించిన కొద్దిపాటి లావాదేవీలకే వర్తిస్తుందని పేర్కొంది. దీంతో యూపీఐ వినియోగించే సాధారణ ప్రజలపై అదనపు భారం పడదని తెలిపింది. యూపీఐ లావాదేవీల సంఖ్య భారీగా పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ భద్రత, మోసాల నివారణ, సాంకేతిక మౌలిక తరువాయి 2లో..



## ఇదేనా.. ఉద్యోగాల పాలన?

- ఉద్యోగం కోసం వస్తే యువతను అవమానిస్తారా?
- నిరుద్యోగులపై అనుచితంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

2

## షరతులు పాటిస్తేనే హర్మూజ్ ఓపెన్

- అమెరికా తన వైఖరిని మార్చే వరకూ జలసంధి తెరవబోం
- తేల్చిచెప్పిన ఇరాన్

6



## నీటి వాటా జోలికొస్తే మరో ఉద్యమమే

- రాష్ట్రానికి అన్యాయం జరిగితే తిరుగుబాటు తప్పదు
- జీఆర్ఎంబీ భేటీ ఎజెండాపై సీఎం సమాధానం చెప్పాలి
- తెలంగాణ హక్కులను కాపాడడంలో కాంగ్రెస్ విఫలం
- ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ నీటి హక్కులకు నష్టం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తే మరోసారి తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాటం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా తీసుకునే ఏ నిర్ణయాన్నీ అంగీకరించబోమని, అవసరమైతే అడ్డుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నందినగర్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే వారం జరగనున్న గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఎజెండాపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసే అంశాలు ఎజెండాలో ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను ఎలా కాపాడతారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రజలకు వివరించాలని కోరారు. తెలంగాణకు నష్టం కలిగించే ఎజెండా ఉంటే ప్రభుత్వం జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు.

### చంద్రబాబు చెప్పుచేతల్లో రేవంత్

తెలంగాణకు వ్యతిరేకంగా గతంలో వ్యవహరించిన ఆదిత్యనాథ్ దాస్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించడం సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో సమర్థులైన ఇంజినీర్లు లేరా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రభావంలో తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చంద్రబాబు చెప్పుచేతల్లో నడుస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆదిత్యనాథ్ దాస్‌ను వెంటనే తొలగించాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో మరోసారి నీటి దోపిడీకి అవకాశం ఇస్తే బీఆర్ఎస్ ఉద్యమానికి దిగుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అంగీకరించబోమన్నారు.

### పంపులు ఆన్ చేయించేందుకు పోరాడాం

వర్షాలు కురుస్తున్నప్పటికీ సాగునీటి పంపులను సకాలంలో ఎందుకు ఆన్ చేయలేదని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ డిమాండ్ చేయడంతోపాటు నార్లాపూర్ తరువాయి 2లో..



2

## సాగునీటి ప్రాజెక్టులకు రూ.5వేల కోట్లు

### భూ సేకరణ, ఆర్‌ఆర్ కోసం నిధుల మంజూరు

- పెండింగ్ పనులకు అత్యధిక ప్రాధాన్యం
- పత్తిపాక, రోళ్లవాగు ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి
- నిధుల కొరతతో ఏ సాగునీటి పనీ ఆగకూడదు
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్

# యూసీబీలను ఏకం చేయాలి

## పట్టణ సహకార బ్యాంకులకు అమిత్ షా సూచన



**ముంబై:** దేశంలోని పట్టణ సహకార బ్యాంకులు (యూసీబీలు) ఆర్‌బీఐతో సమన్వయంతో ముందుకు సాగాలని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా సూచించారు. యూసీబీలకు ఆర్‌బీఐ అనేక వెసులుబాట్లు కల్పిస్తోందని తెలిపారు. ముంబయిలో ఎన్‌యూసీఎఫ్‌డీసీ నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శాఖల ఏర్పాటులో వెసులుబాటు, ఇంటివద్దకే బ్యాంకింగ్ సేవలు, డిమాండ్ డ్రాఫ్టులు, లైఫ్ సర్టిఫికెట్ల జారీకి అనుమతులు, ప్రత్యేక నోడల్ అధికారి నియామకం వంటి చర్యలను ప్రస్తావించారు. యూసీబీల వద్ద రూ.6 లక్షల కోట్లకు పైగా డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు. చిన్న రుణగ్రహీతలే బ్యాంకులకు అత్యంత భద్రమైన వర్గమని షా అన్నారు. గుజరాత్‌లో తాను యూసీబీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు రూ.2.5 లక్షల వరకు పూచీకత్తు లేకుండా రుణాలు ఇచ్చామని, వాటిని వడ్డీతో సహా చెల్లించిన వారి శాతం 99కిపైగా ఉందని చెప్పారు. బంగారు రుణ పరిమితి పెంపు, వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అనుమతిని స్వాగతించారు.

### సభ్యులుగా చేర్చాలి

యూసీబీల అంబ్రెల్లా సంస్థ ఎన్‌యూసీఎఫ్‌డీసీ ప్రధాన కార్యాలయాన్ని త్వరలో న్యూఢిల్లీ నుంచి మహారాష్ట్రకు తరలించనున్నట్లు షా తెలిపారు. ప్రస్తుతం 690 యూసీబీలు మాత్రమే సభ్యులుగా ఉన్నాయని, దేశంలోని మొత్తం 1,400 యూసీబీలను సభ్యులుగా చేర్చేందుకు రుసుము తగ్గించాలని సూచించారు.

# కెనడా నుంచి భారతీయుల భారీ డిపోర్టేషన్

- ఆరు నెలల్లో 3,323 మంది వెనక్కి
- తొలగింపుల్లో భారతీయులదే అగ్రస్థానం
- వలస నిబంధనల ఉల్లంఘన, వీసా గడువు ముగింపే ప్రధాన కారణాలు

**ఒట్టావా:** కెనడా నుంచి భారతీయుల డిపోర్టేషన్లు గణనీయంగా పెరిగాయి. 2026 జనవరి నుంచి జూన్ వరకు ఆ దేశం 3,323 మంది భారతీయులను వెనక్కి పంపినట్లు కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ) అధికారిక గణాంకాలు వెల్లడించాయి. 2025లో మొత్తం ఏడాదిలో 3,779 మంది భారతీయులను డిపోర్ట్ చేయగా.. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే ఆ సంఖ్యలో దాదాపు 88 శాతం మేర డిపోర్టేషన్లు నమోదయ్యాయి. ఇదే ధోరణి కొనసాగితే గత ఆరేళ్ల రికార్డు స్థాయిలను ఈ ఏడాది అధిగమించే అవకాశం ఉంది. 2026 తొలి ఆరు నెలల్లో కెనడా నుంచి తొలగించిన విదేశీయుల్లో భారతీయులే అత్యధికంగా ఉన్నారు. మెక్సికో నుంచి 1,573 మందిని వెనక్కి పంపారు. గత ఐదేళ్లుగా డిపోర్టేషన్లలో మెక్సికో అగ్రస్థానంలో ఉండగా.. భారత్ రెండో స్థానంలో కొనసాగింది. 2020లో చివరిసారిగా భారతీయులు ఈ జాబితాలో మొదటి స్థానంలో నిలిచారు. ఆ ఏడాది 1,424 మంది భారతీయులను కెనడా నుంచి పంపించారు. సీబీఎస్ఏ గణాంకాల ప్రకారం.. 2021లో 603 మంది, 2022లో 786 మంది, 2023లో 1,132 మంది, 2024లో 2,004 మంది భారతీయులు కెనడా నుంచి డిపోర్ట్ అయ్యారు. 2025లో ఈ సంఖ్య 3,779కు చేరింది.

### తొలగింపు ప్రక్రియలో 7,669 మంది

కెనడా ప్రస్తుతం వలస విధానాలను కఠినతరం చేస్తోంది. అంతర్జాతీయ విద్యార్థులు, తాత్కాలిక ఉద్యోగులు సహా తాత్కాలిక నివాసితుల సంఖ్యను తగ్గించే చర్యలు చేపడుతోంది. వలస నిబంధనలు పాటించకపోవడం, ఆశ్రయం లేదా శరణార్థి దరఖాస్తులు తిరస్కరణకు గురికావడం, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలో కొనసాగడం, వీసా మోసాలకు పాల్పడటం తదితర కారణాలతో భారతీయులను డిపోర్ట్ చేస్తున్నట్లు సీబీఎస్ఏ వివరాలు సూచిస్తున్నాయి. ఇదే సమయంలో కెనడా నుంచి తొలగింపు ప్రక్రియ కొనసాగుతున్న వారి జాబితాలోనూ భారతీయులే అత్యధికంగా ఉన్నారు. 7,669 మంది భారతీయులు ప్రస్తుతం తొలగింపునకు ఎదురుచూస్తున్నట్లు సీబీఎస్ఏ గణాంకాలు వెల్లడించాయి.

### మూడు రకాల తొలగింపు ఉత్తర్వులు

కెనడాలో విదేశీయుల తొలగింపునకు ప్రధానంగా మూడు రకాల ఉత్తర్వులు ఉంటాయి. డిపార్చర్ ఆర్డర్ జారీ అయితే 30 రోజుల్లోగా స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లాలి. అలా వెళ్లకపోతే అది డిపోర్టేషన్ ఆర్డర్‌గా మారుతుంది. ఎక్స్‌క్లూజన్ ఆర్డర్ ద్వారా సాధారణంగా ఒకటి నుంచి ఐదేళ్ల వరకు కెనడాలోకి తిరిగి ప్రవేశించకుండా నిషేధం విధిస్తారు. డిపోర్టేషన్ ఆర్డర్ జారీ అయితే కెనడా ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా లిఖితపూర్వక అనుమతి పొందితే తప్ప తిరిగి ప్రవేశించే అవకాశం ఉండదు.

### అమెరికాతో పోలిస్తే రెండున్నర రెట్లు

కెనడా నుంచి ఈ ఏడాది డిపోర్ట్ చేసిన భారతీయుల సంఖ్య అమెరికా నుంచి భారత్‌కు పంపిన వారి కంటే రెండున్నర రెట్లకుపైగా ఉంది. అమెరికా నుంచి జనవరి 1 నుంచి జూలై 22 వరకు 1,273 మంది భారతీయులను డిపోర్ట్ చేసినట్లు భారత విదేశాంగ శాఖ గత నెల వెల్లడించింది.

# చిలకలగూడలో నేడు బోనాలు

## భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు

**ప్రజానావ, హైదరాబాద్:** చిలకలగూడ డివిజన్‌లో ఈ నెల 9, 10 తేదీల్లో జరగనున్న బోనాల పండుగకు పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని దేవాలయాల వద్ద ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం ఎనిమిది దేవాలయాలు ఉండగా, భద్రత కోసం 295 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఆరు ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేశారు. 17 ఫలహారం బండ్ల ఊరేగింపులు జరగనున్న నేపథ్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. చిలకలగూడ, సీతాఫల్‌మండి చౌరస్తాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించనున్నారు. కట్ట మైసమ్మ, పోచమ్మ ఆలయాల వద్ద కూడా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 27 దేవాలయాలు ఉండగా, భద్రత కోసం 90 మంది పోలీసు సిబ్బందిని నియమించారు. ఆరు పికెట్లు ఏర్పాటు చేసి, 14 ఫలహారం బండ్ల ఊరేగింపులకు భద్రత కల్పించనున్నారు. లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో 22 దేవాలయాలు ఉండగా, బందోబస్తు కోసం 70 మంది సిబ్బందిని నియమించారు. ఐదు పికెట్లు ఏర్పాటు చేసి, తొమ్మిది ఫలహారం బండ్ల ఊరేగింపులకు భద్రత కల్పించనున్నారు. బోనాల పండుగ సందర్భంగా భక్తులు, ప్రజలు పోలీసులకు సహకరించి ప్రశాంతంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని కోరారు.

# నేడు నర్సంపేటకు గులాబీ బాస్

- నల్లబెల్లిలో పెద్ది కుటుంబసభ్యులకు పరామర్శ
- రూ.2.25 కోట్ల సాయం అందించనున్న గులాబీ బాస్
- ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి.. తల్లి అమృతమ్మకు రూ.25 లక్షలు
- సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామన్న మాజీ సీఎం

**ప్రజానావ, వరంగల్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదివారం నర్సంపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పార్టీ సీనియర్ నాయకుడు, తన ముఖ్య అనుచరుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించనున్నారు. పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పనున్నారు. అనంతరం నర్సంపేట నియోజకవర్గానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ది అభిమానులతో కేసీఆర్ సమావేశం కానున్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా నిలవాలని కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా కుటుంబానికి మొత్తం రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. పెద్ది ఇద్దరు పిల్లల భవిష్యత్తు కోసం చెరో రూ.కోటి చొప్పున, ఆయన తల్లి అమృతమ్మ అవసరాల కోసం రూ.25 లక్షలను ఆమె పేరిట బ్యాంకులో జమ చేయాలని నిర్ణయించారు. కుటుంబంలో నెలకొన్న విషాద పరిస్థితుల్లో బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు. పిల్లల చదువు, భవిష్యత్తుతోపాటు కుటుంబ సంక్షేమాన్ని పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తుందని తెలిపారు.

### ఎల్లవేళలా అండగా..

బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పెద్ది సుదర్శన్‌రెడ్డి పార్టీ కోసం నిబద్ధతతో పనిచేశారని కేసీఆర్ గుర్తుచేశారు. పార్టీ కోసం నిరంతరం శ్రమించిన ఆప్తుడిని కోల్పోవడం తీవ్ర విషాదాన్ని కలిగించిందన్నారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవడం పార్టీ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం ఆర్థిక సాయం నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. దశదినకర్మ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్య నాయకులు మరోసారి సమావేశమై కుటుంబ సంక్షేమానికి అవసరమైన చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

# ఇదేనా ఉద్యోగాల పాలన?

- ఉద్యోగం కోసం వస్తే యువతను అవమానిస్తారా?
- నిరుద్యోగులపై అనుచితంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**ప్రజానావ, హైదరాబాద్:** హైడ్రాలో 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం వచ్చిన వేలాది మంది నిరుద్యోగులను అవమానించడం దారుణమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాల కోసం వచ్చిన యువత పట్ల అనుచితంగా, అసభ్యంగా వ్యవహరించిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను అవమానించినందుకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద హైడ్రా డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై హరీశ్‌రావు 'ఎక్స్' వేదికగా స్పందించారు. విద్యార్థులు, నిరుద్యోగులపై ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, 32 నెలలు గడిచినా ఆ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఇంజినీరింగ్, పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యను అభ్యసించిన యువత సైతం చిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్‌రావు అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి ఉంటే కేవలం 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది ఇలా క్యూలలో నిలబడాల్సిన అవసరం ఉండేదా అని ప్రశ్నించారు. ఉద్యోగాల కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే దుర్భాషలాడటం బాధాకరమని అన్నారు. ముఖ్యమంత్రి స్థాయి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం, అదే తరహాలో అధికారులు వ్యవహరించడం 'యథా రాజా.. తథా అధికారులు' అన్న చందంగా ఉందని వ్యాఖ్యానించారు.

### 2లక్షల ఉద్యోగాల హామీ బోగస్

ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులకు ఉద్యోగాలపై హామీలు ఇచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు ఉద్యోగాల కోసం వచ్చిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్నీ బోగస్‌గా మారాయని విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని, నోటిఫికేషన్లు సక్రమంగా వెలువడకపోవడంతో ఉన్నత విద్యావంతులు సైతం తక్కువ స్థాయి ఉద్యోగాలకు పోటీ పడాల్సి వస్తోందన్నారు. నిరుద్యోగులను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు విద్యార్థులు, నిరుద్యోగులకు ప్రభుత్వం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# భారీవర్షానికి నీట మునిగిన రోడ్డు

## నీటిలో కుర్చుని కార్పొరేటర్ నిరసన

**ప్రజానావ, కామారెడ్డి,:** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో నీటి కుంటలో కుర్చొని బీఆర్ఎస్కు చెందిన 46వ వార్డు కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మి నారాయణ నిరసన తెలిపారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లా కేంద్రంలోని కామారెడ్డి నుండి కరీంనగర్ జాతీయ రహదారి అయిన స్టేషన్ రోడ్డు లోని పోలీస్ స్టేషన్ ముందు వరద నీరు ఎటు వైపు కుడా వెళ్లకుండా అక్కడే నిలిచి ఉంది. ఒక ప్రధాన రహదారి ఒక కుంట, ఒక చెరువును తలపిస్తూ రహదారి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వరద నీటి కుంట వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కావున ఈ నీటి కుంటతో ట్రాఫిక్ జామై వాహనదారులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇదే దారిలో ఉంది. రోగులు, క్షతగాత్రులు ఎమ్జెంచీన్సీ సమయంలో 108 వాహనం, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ఇతర వాహనాలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు ఇట్టి సమస్యను పరిష్కరించకుంటే అక్కడే దీక్ష చేపడతానని స్పష్టం చేశారు.

# మరింత విషమంగా మెడికో ప్రియాంక ఆరోగ్యం

**ప్రజానావ, హైదరాబాద్ :** రాజమండ్రి మెడికో విద్యార్థిని ప్రియాంక ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. ప్రస్తుతం వెంటిలేటర్‌పై వైద్యులు ఆమెకు చికిత్స అందజేస్తున్నారు. ఇటీవల రాజమండ్రిలోని ప్రసాద్ ఆదిత్యామాల్‌లో స్కూటీపై వెళ్తున్న మెడికోలు డాక్టర్ ప్రియాంక, దుర్గవెంకటసాయిలను మద్యం సేవించిన కొందరు యువకులు కారుతో బలంగా ఢీకొట్టారు. ఈ నేపథ్యంలో ప్రియాంక తలపై నుంచి కారు వెళ్లడంతో బ్రెయిన్ డెడ్‌కు గురైంది. దీంతో విద్యార్థినిని హుటాహుటిన రాజమండ్రి నుంచి హైదరాబాద్‌కు తరలించగా.. కిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. గడిచిన ఆరో రోజులుగా ప్రియాంక మృత్యువుతో పోరాడుతోంది. మెడికో ప్రియాంక చికిత్సలో చివరి ప్రయత్నంగా నేడు అప్నియా పరీక్ష చేయనున్నారు. కోమాలో ఉన్న ప్రియాంక మెదడు పూర్తిగా పనిచేయడం ఆగిపోయిందా.. లేదా అని నిర్ధారించడానికి డాక్టర్లు కీలకమైన పరీక్ష చేయనున్నారు. ప్రియాంక బ్రెయిన్ డెడ్ అయిందా.. లేదా అనేది అప్నియా పరీక్షతో తెలుసుకోనున్నారు. అప్నియా పరీక్ష అనంతరం చివరి రిజల్ట్‌ను విద్యార్థిని తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు. అంతేకాకుండా, ప్రియాంక ఆర్గాన్ డొనేషన్ చేసే విషయంపై తల్లిదండ్రులకు ఇప్పటి పలు మార్లు కిమ్స్ వైద్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర

## సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.సాబీర్ పాషా

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం,:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా చైతన్య యాత్ర సాగుతుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.సాబీర్ పాషా తెలిపారు. శనివారం బూర్గంపహాడ్ మండల కేంద్రానికి చేరుకున్న యాత్రలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ దేశంలో ప్రజా సమస్యలపై చైతన్యం కల్పించి మార్పు తీసుకువచ్చేందుకు కలిసికట్టుగా యాత్రలో అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ప్రజల నుదోచుకునే పాలన మారాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద యువత, విద్యార్థులు చేపట్టిన ఉద్యమమే ప్రజా చైతన్యానికి నిదర్శనమన్నారు. మండలంలో ప్రతి ఏడాది గోదావరి వరదలతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మండలాన్ని ముంపు నుంచి శాశ్వతంగా రక్షించేందుకు ఎత్తైన ప్రదేశాల్లో పక్కా ఇళ్లు నిర్మించి ఆర్అండ్ఆర్ ప్యాకేజీతో పాటు భూములకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ యాత్రలో కొత్తగూడెం మేయర్ మూడ్ గణేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్లు

- భూసేకరణ, ఆర్అర్ కోసం నిధుల మంజూరు
- పెండింగ్ పనులకు అత్యధిక ప్రాధాన్యం
- పత్తిపాక, రోళ్లవాగు ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి
- నిధుల కొరతతో ఏ సాగునీటి పనీ ఆగకూడదు
- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల పనులకు ఊతమిచ్చేలా భూసేకరణ, పునరావాసం, పునరుద్ధరణ (ఆర్అర్) కోసం రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నిధుల కొరత కారణంగా సాగునీటి పనులు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

### పత్తిపాకకు ఫాస్ట్‌ట్రాక్

పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉత్తమ్ తెలిపారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. పత్తిపాక రిజర్వాయర్ పనులను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. మొత్తం 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.

### నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్

పత్తిపాక రిజర్వాయర్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఆగస్టు నెలాఖరులోగా సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణ, టెండర్లు, వివిధ అనుమతుల ప్రక్రియలను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాస ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

### రోళ్లవాగుతో 15 వేల ఎకరాలకు నీరు

96 శాతం పనులు పూర్తయిన రోళ్లవాగు ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఉత్తమ్ చెప్పారు. మిగిలిన పనులను పూర్తి చేసి చివరి ఆయకట్టులోని 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి పెండింగ్ సమస్యను స్పష్టమైన 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని మంత్రి అధికారులను ఆదేశించారు. తదుపరి సమీక్ష నాటికి ప్రతి అంశంపై తీసుకున్న చర్యల నివేదిక (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

# జీవితమంటే లీడర్ బోర్డు కాదు

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. స్నాతకోత్సవంలో 587 మంది పీహెచ్‌డీ పరిశోధకులు సహా 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి గోల్డ్ మెడల్, డైరెక్టర్ గోల్డ్ మెడల్, శంకర్ దయాళ్ శర్మ గోల్డ్ మెడల్, పర్ఫెక్ట్ టెన్ గోల్డ్ మెడల్స్‌ను మోదీ అందజేశారు. ఐఐటీలో విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహాలు, హాస్టల్ అనుభవాలను భవిష్యత్తులోనూ గుర్తు చేసుకోవాలని మోదీ అన్నారు. అధ్యాపకులు, మెంటర్లు, సహ విద్యార్థులు, సిబ్బంది తమ జీవితాల్లో కీలక పాత్ర పోషించిన వ్యక్తులుగా ఎప్పటికీ గుర్తుండిపోతారని పేర్కొన్నారు.

### 'పరమ్ ప్రజ్ఞ' ప్రారంభం

ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరమ్ ప్రజ్ఞ' ఏఐ ఆధారిత హై–పర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ సదుపాయాన్ని మోదీ ప్రారంభించారు. కృత్రిమ మేధ, డేటా సైన్స్, అధునాతన కంప్యూటింగ్, అంతరశాఖ పరిశోధనలకు ఈ సదుపాయం మరింత ఊతమివ్వనుందని తెలిపారు.

# యూపీఐ ఫ్రీ!

(మొదటిపేజీ తరువాయి)

సదుపాయాలపై నిరంతరం పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తెలిపింది. కేవలం ప్రభుత్వ సబ్సిడీలపై ఆధారపడటం దీర్ఘకాలంలో సాధ్యం కాదని, మరిన్ని సంస్థలు ఈ రంగంలోకి వచ్చి పోటీ పెంచేందుకు స్వయం సమృద్ధి కలిగిన ఆదాయ నమూనా అవసరమని పేర్కొంది. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో యూపీఐ విస్తరణతోపాటు అంతర్జాతీయంగా పోటీతత్వాన్ని కొనసాగించేందుకు సమతుల్యమైన విధానం అవసరమని వివరించింది.

### జులైలో రూ.29.9 లక్షల కోట్ల లావాదేవీలు

2016–17లో ప్రారంభమైన యూపీఐ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద రియల్‌టైమ్ చెల్లింపుల వ్యవస్థగా ఎదిగిందని ప్రభుత్వం తెలిపింది. 2026 జులైలో ఒక్క నెలలోనే 2,366 కోట్ల లావాదేవీల ద్వారా రూ.29.9 లక్షల కోట్ల విలువైన చెల్లింపులు జరిగాయని పేర్కొంది. ప్రస్తుతం 11 విదేశీ దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులో ఉండగా.. మరికొన్ని దేశాలు దీనిని స్వీకరించేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపింది.

### విదేశీ ఒత్తిడి అవాస్తవం

యూపీఐపై విధాన మార్పుల వెనుక విదేశీ ఒత్తిళ్లు ఉన్నాయన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వం కొట్టిపారేసింది. 2016లో యూపీఐని ప్రవేశపెట్టినప్పటి నుంచి దాని అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం, నిధులు అందించిందని గుర్తుచేసింది. 2020 జనవరి నుంచి పౌరులు, మర్చంట్లకు యూపీఐని ఉచితంగా అందుబాటులో ఉంచామని తెలిపింది. భారత్ సొంత ఆవిష్కరణగా యూపీఐని మరింత సురక్షితంగా, అందుబాటులో ఉండేలా, సుస్థిరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంది. యూపీఐపై వస్తున్న అనధికారిక ప్రచారాలను నమ్మకుండా ఆర్థిక శాఖ, ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐ విడుదల చేసే అధికారిక సమాచారాన్నే పరిగణనలోకి తీసుకోవాలని ప్రజలకు సూచించింది.

# నీటి వాటా జోలికొస్తే మరో ఉద్యమమే

(మొదటిపేజీ తరువాయి)

ముట్టడికి పిలుపునిస్తామని హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వం పంపులను ఆన్ చేసిందని అన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డికి పాలమూరు నీళ్లపై కనీస శ్రద్ధ లేదని విమర్శించారు. పక్క రాష్ట్రం తెలంగాణ నీటిని ఎత్తిపోసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రధాన ప్రతిపక్షం ఒత్తిడి తెస్తేనే ప్రభుత్వం స్పందిస్తోందని, లేకుంటే నిద్రపోతున్నట్లుగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు.

### మాకు క్షుద్ర రాజకీయాలు తెలియవు

క్షుద్రపూజల పేరుతో క్షుద్ర రాజకీయాలకు పాల్పడుతున్నది కాంగ్రెస్ పార్టీయేనని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం పోరాడి, త్యాగాలు చేసిన తమకు అలాంటి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తెలంగాణ బాగుండాలన్నదే బీఆర్ఎస్ లక్ష్యమని చెప్పారు. హరీశ్‌రావు ఆలయానికి వెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం తగదన్నారు. మేడిగడ్డ, చెక్‌డ్యామ్‌ల విషయంలోనూ రాజకీయ ప్రయోజనాల కోసం విధ్వంసానికి పాల్పడే సంస్కృతి బీఆర్ఎస్‌కు లేదని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. అనేక ప్రాంతాల్లో రోజుకు ఐదారు సార్లు విద్యుత్ కోతలు ఉంటున్నాయని ఆరోపించారు. ఏ సబ్‌స్టేషన్‌కైనా వచ్చి పరిస్థితిని పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, 24 గంటల విద్యుత్ సరఫరా ఎక్కడ జరుగుతోందో ప్రభుత్వం చూపించాలని సవాల్ చేశారు.

### హైడ్రాపై వైఖరిని గమనించాలి

కోర్టులు ఆదేశాలు ఇచ్చినప్పటికీ హైడ్రా విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరును ప్రజాస్వామ్యవాదులు గమనించాలని కేటీఆర్ కోరారు. ముఖ్యమంత్రి ప్రజా, రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 58 జీవో కింద సుమారు 2.5 లక్షల మందికి పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క పట్టా కూడా ఇవ్వలేదని విమర్శించారు. పైగా వేలాది ఇళ్లను కూల్చివేశారని ఆరోపించారు.

### రూ.5 లక్షల కోట్ల స్కామ్

హైదరాబాద్‌లోని సుమారు 10 వేల ఎకరాల పారిశ్రామిక భూముల విషయంలో రూ.5 లక్షల కోట్ల విలువైన స్కామ్‌కు ప్రభుత్వం పాల్పడుతోందని కేటీఆర్ ఆరోపించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా తనకు అనుకూలంగా మళ్లిస్తోందో లేఖలు, ప్రజెంటేషన్ల ద్వారా ప్రజలకు వివరిస్తామని చెప్పారు. రైతుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డికి కనీస అవగాహన లేదని కేటీఆర్ విమర్శించారు. నీటిని ఎప్పుడు ఎత్తిపోసుకోవాలో కూడా సీఎంకు తెలియదని, ఈ అంశంపై హరీశ్‌రావు ప్రశ్నించినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. సీఎం దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ మాత్రమేనని ఎద్దేవా చేశారు.

# కార్మికుడి మృతదేహంతో ఆందోళన

**ప్రజానావ, బూర్గంపహాడ్ :** లారీ ప్రమాదంలో మృతి చెందిన ఐటీసీపీఎస్పీడీ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుడు గుగులోత్ శ్రీరావ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఐటీసీ గేటు వద్ద ఆందోళనకు దిగారు. విధులు ముగించుకుని వాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో ఐటీసీ సమీపంలో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే శ్రీరావ్ మృతిచెందాడు. యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన చేపట్టారు.

# అత్యవసర సమయాల్లో సీపీఆర్ ఆవశ్యకం

## కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం :** గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి అత్యవసర సమయంలో సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సి.హెచ్.వెంకటరమణ అన్నారు. జీ.ఎం ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు శిక్షణ కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఇన్‌చార్జ్ ఎంఆర్ఎస్ అనంతరామయ్య, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



## ప్రతి మత్స్య సొసైటీకి ఉచిత చేప పిల్లలకు బదులు నగదు జమ చేయాలి

- నిరుద్యోగ యువతకు ఆర్నమెంటల్ ఫిష్ సీడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రోత్సహించాలి
- 10న జైలు బరో కు మత్స్యకారుల సంఘం మద్దతు

ప్రజానావ, మంచిర్యాల : తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో హాజీపూర్ మండలంలోని ముల్కల, రాపెల్లి, నంనూర్ గుడిపేట, మత్స్యకారుల స్థితిగతులపై సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బోడెంకి చందు మత్స్యకారుల సంఘం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. ప్రతి మత్స్య సొసైటీకీ ఉచిత చేప పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని, మత్స్యకార నిరుద్యోగులకు ఫిష్ ఫుడ్ కోర్టులు, ఆర్నమెంటల్ ఫిష్ సీడ్ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించా లని, ప్రతి మండల కేంద్రంలో చాపల మార్కెట్ నిర్మించాలని ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు టూ వీలర్స్,ఫోర్ వీలర్స్ వాహనాలు అందించాలని, మరియు పెండింగ్లో ఉన్న ఎక్స్ గ్రేషియో, ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10న జైల్ బరో కార్యక్రమానికి మత్స్యకార సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంచర్ల రాజేందర్ జిల్లా అధ్యక్షులు, భోగిరి రాజ్ కుమార్ జిల్లా ఉపాధ్యక్షులు పలు గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

- క్విట్ ఇండియా ఉద్యమం దేశ చరిత్రలో మహోన్నత ఘట్టం
- రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, ఎంపీ డాక్టర్ మల్లు రవి



ప్రజానావ, నాగర్‌కర్నూల్: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు దేశ ప్రజలకు ఎప్పటికీ చిరస్మరణీయమని కాంగ్రెస్ ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'పోరాడు లేదా మరణించు' పిలుపుతో దేశ ప్రజలంతా ఏకమై బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటంలో ఉప్పెనలా కదిలారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం లక్షలాది మంది తమ జీవితాలను, ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుల పోరాట ఫలితంగానే స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం భారత స్వాతంత్ర్య సంగ్రామంలో అత్యంత కీలకమైన చారిత్రక ఘట్టమని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల త్యాగాలను నేటి తరాలు స్మరించుకోవాలని, వారి స్ఫూర్తితో దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులందరికీ ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పిద్దామని డాక్టర్ మల్లు రవి కోరారు.

## పరివాహక రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజానావ, గంభీరావుపేట: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు పరివాహక ప్రాంత రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ మారుతి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేరుకు ప్రధాన ఆధారమైన పల్వంచ వాగు ఉధృతంగా ప్రవహించి మానేరులోకి నీరు వస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి ఏ క్షణానైనా పొంగిపొర్లే అవకాశముండగా ప్రాజెక్టు పరిధిలోని రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చీకటిలోపు వ్యవసాయ పనులు ముగించుకుని రైతులు ఇండ్లకు చేరుకోవాలని కోరారు.



## ఎగువ మానేరుకు జలకళ

- ప్రాజెక్టులోకి భారీగా చేరుతున్న వరద నీరు
- 29 ఫీట్లకు చేరిన ప్రాజెక్టు నీటిమట్టం

ప్రజానావ, గంభీరావుపేట: ఎడతెరిపి లేకుండా ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేజ్ ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టుకు ప్రధాన ఆధారమైన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పల్వంచ, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం కూడెల్లి వాగులు ద్వారా వస్తున్న భారీ వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. 31 ఫీట్ల ఎత్తున ప్రాజెక్టులో శనివారం సాయంత్రం వరకు 29 అడుగుల నీరు చేరుకుంది. మానేరు పొంగి పొర్లెందుకు మరో రెండు అడుగుల నీటి చేరువలో ఉంది. మరో 24 గంటలు భారీ వర్షాలు కురిసిన పక్షంలో మానేరు పరవళ్ళు తొక్కనుంది. భారీ వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండడంతో ప్రాంత ప్రజలు రైతులు ప్రాజెక్టు వద్దకు వెళ్లి సందర్శిస్తున్నారు.

## బోనాల జాతర–2026కు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఆహ్వానం

- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మంత్రి
- యూట్యూబర్లు కళాకారుల ఐక్యతపై ప్రశంసలు



ప్రజానావ, జగిత్యాల: జగిత్యాల జిల్లా యూట్యూబర్లు, డిజిటల్ క్రియేటర్లు, కళాకారులు ఉమ్మడిగా ఈ నెల 11న అత్యంత వైభవంగా నిర్వహించనున్న "బోనాల జాతర–2026" మహోత్సవానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ మేరకు జాతర మహోత్సవ వర్కింగ్ కమిటీ సభ్యులు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన "బోనాల జాతర–2026" అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. జిల్లాలోని యూట్యూబర్లు, డిజిటల్ క్రియేటర్లు, కళాకారులు ఒకే వేదికపైకి వచ్చి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. బోనాల పండుగను ఇంతటి వైభవంగా నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పేలా నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బోనాల జాతర–2026 వర్కింగ్ కమిటీ ప్రతినిధులు, నిర్వాహకులు, పలువురు యూట్యూబర్లు, డిజిటల్ క్రియేటర్లు, స్థానిక కళాకారులు పాల్గొన్నారు.

## బోనాల హాస్టల్‌లో అన్నంలో పురుగులు, అధ్వానంగా వాష్ రూమ్‌లు

- పేరెంట్స్‌తో కలిసి బీఆర్ఎస్వి నేతల హాస్టల్ సందర్శన
- విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం.. తక్షణమే చర్యలు చేపట్టాలి
- బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ డిమాండ్



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాల హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న అన్నంలో పురుగులు వస్తున్నాయని, వాష్‌రూమ్‌లు అధ్వానంగా ఉండటంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారని తెలిపారు. శనివారం తల్లిదండ్రులతో కలిసి హాస్టల్‌ను పరిశీలించిన రవి గౌడ్, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే టీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి వినయ్ కుమార్, సదుల శేఖర్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో అనుమానాస్పద స్థితిలో నేత కార్మికుడు మృతి

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణంలో సిరిసిల్ల పట్టణంలో వెంగల వెంకటేష్ అనుమానాస్పదంగా మృతి చెందాడు. స్థానిక తారకరామా నగర్‌కు చెందిన నేత కార్మికుడు శనివారం రగుడు సమీపంలోని మణికంఠ ఫంక్షన్ హాల్ వెనుక గుట్ట వద్ద మృతదేహమై కనిపించాడు. ఇందిరమ్మ ఇళ్లు కోసం మున్సిపల్ వైస్ చైర్మన్ డబ్బులు డిమాండ్ చేశాడంటూ గతంలో వీడియో వైరల్ అయింది. ఈ ఆరోపణ చేసిన వ్యక్తి శనివారం మృతి చెందడంతో ఈ సంఘటన అనుమానస్పదంగా మారింది. ఆ సంఘటనలో వైస్ చైర్మన్‌పై మున్సి పల్ కమిషనర్ పోలీసులకు ఫిర్యా దు చేయగా.. కేసు నమోదై దర్యాప్తులో ఉంది. ఇదిలా ఉండగా మృతుడి డెడ్ బాడీని పోస్టుమార్టం నిమిత్తం సివిల్ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడి దహన సంస్కారాలకు కూడా నిర్వహించే స్తోమత లేదని తెలిపారు. మృతుడికి భార్య ఒక బిడ్డ ఉన్నారు. పోలీసులు సంఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.



## వేములవాడ భీమన్నను దర్శించుకున్న హీరో అఖిల్ రాజ్

ప్రజానావ, వేములవాడ: రాజు వెడ్స్ రాంబాయి' మూవీ హీరో అఖిల్ రాజ్ శుక్రవారం వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నప్పటి నుంచే వేములవాడ రాజన్నపై తనకు భక్తి ఉందని అఖిల్ రాజ్ తెలిపారు. ఆలయంలో తనకు చక్కటి దర్శన ఏర్పాట్లు చేసిన సిబ్బందికి కృతజ్ఞతలు చెప్పారు. ప్రస్తుతం అనుపమ పరమేశ్వరితో కలిసి 'క్రేజీ కళ్యాణం' చిత్రంలో నటిస్తున్నట్లు వెల్లడించారు. స్వామివారి ఆశీస్సులతో తనకు, తన సినిమాలకు మంచి విజయం కలగాలని కోరుకున్నారు.

## రైతుల పొట్టకొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- దేవాదుల నీటిని వెంటనే విడుదల చేయాలి
- గ్రావిటీ కెనాల్ ద్వారా గణపురం చెరువుకు నీరందించాలి
- ఆగస్టు 15లోగా పెంచిన పింఛన్లు పంపిణీ చేయాలి: మాజీ ఎమ్మెల్యే గండ్ర




ప్రజానావ, జయశంకర్ భూపాలపల్లి: ఏరికోరి తెచ్చుకున్న ప్రభుత్వమే రైతుల పొట్టకొడుతోందని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్న పరిస్థితిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా తాగు, సాగునీటి అవసరాలను తీర్చేందుకు దేవాదుల ప్రాజెక్టును నిర్మించినట్లు గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం నెలకు 6 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ, తొమ్మిది పంపులు పనిచేయా ల్సిన చోట ప్రస్తుతం ఆరు లేదా ఏడు పంపులను మాత్రమే నడుపుతున్నారని విమర్శించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగానే రైతులకు సాగునీరు అందడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామప్ప నుంచి గ్రావిటీ ద్వారా గణపురం చెరువుకు నీటిని తరలించేందుకు రూ.18 కోట్లు కేటాయించి నిర్ణయం తీసుకున్నామని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను పక్కనపెట్టిందని అన్నారు. నీటిని తరలించేందుకు మార్గం అందుబాటులో ఉన్నప్పటికీ రైతుల పంటలు ఎండిపోతుండటం బాధాకరమని, వెంటనే గ్రావిటీ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమై ఇప్పుడు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించడం సమంజసం కాదని గండ్ర వెంకటరమణారెడ్డి ఎద్దేవా చేశారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు. అలాగే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన పింఛన్లను అర్హులైన లబ్ధిదారులందరికీ ఆగస్టు 15లోగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## మిథిలా ప్రాంగణంలోని శ్రీరామసేవా మండపంలో నిత్య కల్యాణాలు

- అభివృద్ధి పనుల నేపథ్యంలో వేదిక మార్పు
- భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ సూచిక బోర్డులు
- మార్గదర్శకానికి ప్రత్యేక భద్రతా సిబ్బంది ఏర్పాటు



ప్రజానావ, భద్రాచలం: శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం స్వామివారి నిత్య కల్యాణాల నిర్వహణ వేదికను మార్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. శనివారం నుంచి స్వామివారి నిత్య కల్యాణాలను మిథిలా ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీరామసేవా మండపంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నందున ఈ మార్పు చేసినట్లు, భక్తులు విషయాన్ని గమనించి దేవస్థానానికి సహకరించాలని ఈవో కోరారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయం నాలుగు వైపులా స్పష్టమైన సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు కొనసాగుతున్న ఉత్తర, దక్షిణ తదితర ప్రాంతాల వద్ద భక్తులకు దిశానిర్దేశం చేయడంతో పాటు ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు అందించేందుకు ప్రత్యేక భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. భక్తులు సూచిక బోర్డులను, భద్రతా సిబ్బంది సూచనలను పాటిస్తూ స్వామివారి దర్శనం, నిత్య కల్యాణ సేవలను సౌకర్యవంతంగా చేసుకోవాలని ఈవో సూచించారు.

## ఎల్‌నినోతో సాగునీటికి కష్టాలు

- సాగర్ నీళ్లు తాగడాని సరిపోవు
- రైతులు ఆరుతడి పంటలనే వేయాలి
- సాగునీటి సలహామండలి సమావేశంలో కోమటిరెడ్డి



ప్రజానావ, నల్గొండ: ఎల్‌నినో కారణంగా ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీరు తాగునీటి సరిపోతుందని, అంతేకాక పైనుంచి నీరు వచ్చే అవకాశం డా లేనందున రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి వేయకుండా ఆరుతడి పంటలు వేసుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఒకవేళ నాగార్జునసాగర్ నిండినప్పటికీ చెరువులు నింపే పరిస్థితి లేదని, ఇప్పటి బోర్లలో డా గ్రౌండ్ వాటర్ తగ్గిపోతున్నందున కష్టకాలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు అండగా నిలబడి ఆరుతడి పంటలు వేసుకునేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. శనివారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీరు డెడ్‌స్టోరేజీలో ఉందని, శ్రీశైలం నుంచి నీరు వచ్చినప్పటికీ పంటలకు సాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీరు జూన్ 2027 వరకు తాగునీటి సరిపోతుందని తెలిపారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని కోరారు. ఏఎంఆర్‌పీ డా సగమే నిండిందని, గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని మంత్రి అన్నారు. కరువు వచ్చినప్పటికీ నల్గొండ జిల్లాకు శాశ్వతంగా సాగునీరు అందించే ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు ఆగస్టు 2028 నాటికి పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. పనులు కొనసాగుతున్నాయని, ఏఎం ఆర్‌పీ, ఎస్ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెలమల ద్వారా జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. ఎస్ఎల్‌బీసీ కోసం ఎంతైనా ఖర్చు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. కరువు వచ్చినా, శ్రీశైలం డెడ్‌స్టోరేజీలో ఉన్నప్పటికీ ఎస్ఎల్‌బీసీ నుంచి సాగు నీరు అందించవచ్చన్నారు. రాబోయే రోజుల్లో సూపర్ ఎల్‌నినో కారణంగా దక్షిణ తెలంగాణలో పరిస్థితులు ఎలా ఉంటాయో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులు ఆరుతడి పంటలు వేసుకునేలా కష్టపడి పనిచేయాలని, ఇలాంటి కరువు పరిస్థితుల్లో రైతులకు అందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో పంట మార్పిడిలో భాగంగా 33 వేల ఎకరాల్లో వరికి బదులు ఆరుతడి పంటలు వేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అయితే దీన్ని లక్షన్నర ఎకరాల లక్ష్యంగా తీసుకుని రైతులతో ఆరుతడి పంటలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో 9 వేల ట్రాన్స్‌ఫార్మర్లపై ఉన్న ఓవర్‌లోడ్‌ను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన విద్యుత్ సామగ్రిని తెప్పి స్తామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కష్టకాలంలో రైతులకు అండగా ఉండాలని, ప్రజలకు ధైర్యం చెప్పాలని, ఆరుతడి పంటలు వేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. విపరీ తంగా ఎరువులు వాడటం, నిరంతరం వరి సాగు చేయడం వల్ల భవిష్యత్తులో ఎలాంటి పంటలు వేసు కోలేని పరిస్థితి వస్తుందన్న విషయాన్ని రైతులకు అవ గాహన కల్పించాలన్నారు. ఇందులో భాగంగా రగా యల పంటలు, ఉద్యాన పంటలు పండించాలని, ఆర్గానిక్ వ్యవసాయం చేసే విధంగా రైతులకు అవ గాహన కల్పించాలని సూచించారు. జిల్లాకు 5 వేల యూనిట్ల స్ప్రింక్లర్లు కావాలని అధికారులు కోరగా.. తక్షణమే వాటిని మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

## సీతారామ నీళ్లను నిర్వాసితులకు అందించాలి

**బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలురి రమేష్**

ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార సాగు భూములకు ప్రాణాధారమైన సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లను ముందుగా స్థానిక భూ నిర్వాసితుల మళ్లించాలని, స్థానిక అవసరాలు తీర్చకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలురి రమేష్ అన్నారు. జూలూరు పాడు మండల ంద్రంలో శనివారం జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ?గోదావరి జలాలు తమ పొలాలకు మళ్లుతాయనే ఆశతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేశారన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా గత రెండు నెలలుగా ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించకుండా నాగార్జున సాగర్ కాలువల్లోకి జలాలను తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి ఉన్న స్థానిక ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన తర్వాతే మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులపై నిజమైన ప్రేమ ఉంటే, తక్షణమే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ?సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కింద నిర్వాసితు లైన రైతులకు ఎకరానికి రూ.21 లక్షల చొప్పున నిధులు టాయించి చెల్లించాలని, సాగునీరు అందక నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అవకాశం ఉన్న ప్రతి చెరువు సీతారామ జలాలను తక్షణమే విడుదల చేయాలని, రాబోయే రబీ సీజన్ నాటికి జిల్లాలోని ప్రతి వ్యవసాయ భూమికీ సాగు నీరు అందేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ?మరోవైపు ంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఎరువుల సబ్సిడీ రూపంలో లక్షల కోట్లు భరిస్తూ ఒక్కో బస్తాపై సుమారు రూ.2,000 వరకు వెసులుబాటు కల్పిస్తోందని తెలిపారు. అయితే, కనీసం బస్తాకు అయ్యే రూ.20 నుండి రూ.30 రవాణా ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించక పోవడం శోచనీయమని, ఆ రవాణా ఛార్జీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, మండల అధ్యక్షులు బుక్యా రమేష్, నాయకులు సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సిరిపురపు పుల్లారావు, బయ్యవరపు వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

## బీజేపీవి కార్మిక వ్యతిరేక విధానాలు

- 10న జిల్లా కేంద్రంలో ర్యాలీకి పిలుపు
- సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ

ప్రజానావ, రాజన్న సిరిసిల్ల : కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించి, కార్మిక చట్టాలు, హక్కులను పరిరక్షించుకోవాలని సీఐటీయూ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ పిలుపునిచ్చారు. ఆగస్టు 10న సోమవారం సిరిసిల్ల కాలేజీ గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్, బీడీ, గ్రామపంచాయతీ, మున్సిపల్, ఆశా, అంగన్వాడీ, హమాలీ, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన, ఆసుపత్రి, గార్మెంట్ తదితర రంగాల కార్మికులు ఉదయం 10 గంటలకు కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి అన్నల్దాస్ గణేష్, నాయకులు సిరిమల్ల సత్యం, దాసరి రూప, సందుపట్ల పోచమల్లు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# బొద్దింకల వేటలో రాహుల్..!

బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది.

బొద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఎ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ డా ఓ క్రమపద్ధతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు.ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తు న్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని డా మార్చారు. జీన్స్, టీ షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితం దీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందు కు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి. టీవీ పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండా, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ డా ద్రవిడ పార్టీలతో పోటీ పడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టిం చుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత వలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబు దారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్విని యోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో డా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసుకుంటున్నాయి. అందు అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందు ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నా రు. జెన్‌జీ లంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్ధం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అందు దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతు న్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకో వాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ ఘావత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహా రావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రు లుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడంలేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుం డగా... వయసులో చిన్నవా డైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేక పోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. వలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్ముందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడుతున్నారు.

EDITORIAL



## పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీని ఆసక్తిగా తిలకించిన మిస్ ఆసియా

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి :** మిస్ ఆసియా రేష్మి ఠాకూర్ జిల్లాలోని పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ విధానాన్ని, స్థానిక సంప్రదాయాలను శనివారం ఆసక్తిగా తిలకించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పైలట్ ప్రాజెక్టుగా నిర్వహించిన 'ఎక్స్‌పీరియన్స్ పోచంపల్లి' కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి టూరిజం పార్క్‌లో సందర్శకులకు ఇక్కత్ దారం మాలలు, తిలకధారణతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్థానిక గైడ్ల ద్వారా ఇక్కత్ వస్త్రాల చరిత్ర, ఫ్రేమ్ మగ్గాలు, గుంత మగ్గాలు, నూలు నుంచి వస్త్రం వరకు వస్త్రాల తయారీ విధానాన్ని వివరించారు. నేత కార్మికుల ఇళ్లను సందర్శించి పోచంపల్లి వస్త్రాల తయారీ విధానంతో పాటు నేత కార్మికుల జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ సంప్రదాయ భోజనాన్ని ఆస్వాదించారు. శివారెడ్డిగూడెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి వ్యవసాయ కూలీలతో కలిసి ఆటపాటల్లో పాల్గొన్నారు. పోచంపల్లి వస్త్రాల తయారీ విధానం, ఇక్కడి సంప్రదాయాలు, గ్రామీణ జీవన విధానాన్ని ప్రత్యక్షంగా చూసిన సందర్శకులు ఉత్సాహంగా, ఆనందంగా గడిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మల్టీనేషనల్ కంపెనీల ఉన్నతాధికారులు, ఫ్రాన్స్ కాన్సులేట్ ప్రతినిధులు, వివిధ సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఏ. శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం, సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, టూరిజం కన్సల్టెన్సీ ప్రతినిధి సాహితీ, ఎన్‌ఐయుఎం ప్రతినిధి నిత్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగుతో రైతులు నష్టపోవద్దు

- ఆరు నెలల పాటు లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం
- పంట మార్పిడిపై 10 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమం
- రైతులతో మాట-పంట మార్పిడికి బాట కార్యక్రమం ప్రారంభం




**ప్రజానావ, సూర్యాపేట:** జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరి సాగు చేసి నష్టపోవద్దని, పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పాటు రాబోయే కాలంలోనూ లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. జూన్, జూలై నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్‌లోనూ ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగుకు వెళ్లకుండా తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌తో కలిసి ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం నాగార్జునసాగర్, ఎస్సారెస్పీ తదితర ప్రాజెక్టుల్లో సమృద్ధిగా నీటి నిల్వలు లేకపోవడంతో సాగునీటి విడుదలపై స్పష్టత లేదన్నారు. జిల్లాలోని 190 పెద్ద చెరువుల్లో అధిక శాతం 25 నుంచి 50 శాతం వరకు మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని, భూగర్భ జలాలు కూడా ఆశించిన స్థాయిలో రీచార్జ్ కావడం లేదని వివరించారు. ప్రస్తుతం ఆగస్టు నెలకు చేరుకున్నందున ఇప్పుడు వరి నాట్లు వేస్తే పంట కోతకు వచ్చే సమయానికి నవంబర్, డిసెంబర్ నెలలు వస్తాయని, అప్పటికి వర్షాలు తగ్గిపోయి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కూడా అడుగంటితే పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించా రు. జిల్లాలో ఇంకా 2.35 లక్షల ఎకరాల్లో సాగు ప్రారంభం కావాల్సి ఉందని, ఆయా ప్రాంతాల రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపికపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. 10 రోజుల పాటు పంట మార్పిడిపై ప్రత్యేక డ్రైవ్: పంట మార్పిడిపై రైతుల్లో అవగాహన కల్పించేందుకు 'రైతులతో మాట—పంట మార్పిడికి బాట' కార్యక్రమా న్ని ప్రత్యేక డ్రైవ్‌గా చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఈనెల 10వ తేదీ నుంచి 10 రోజుల పాటు నిర్వహిస్తామని, ప్రతి అధికారి కనీసం 10 మంది రైతులను వ్యక్తిగతంగా కలిసి పంట మార్పి డిపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏఈఓలు, మహిళా సంఘాల ప్రతినిధు లు కార్యక్రమంలో పాల్గొంటారని, గ్రామస్థాయిలో రైతు వేదికల ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరిస్తారని తెలిపారు. వరికి బదులుగా కందులు, పెసర్లు, మినుములు, మొక్కజొన్న, వేరుశనగ, ఆయిల్‌పామ్ వంటి ఆరుతడి పంటలతో పాటు కూరగాయల సాగును చేపట్టాలని రైతులకు సూచించారు. కరువు వచ్చినా అండగా ఉంటాం: రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నప్పటికీ ప్రజలు అధైర్యపడా ల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ భరోసా ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. సాగునీటి సమస్యల నుంచి గట్టెక్కేందుకు రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ ఈనెల 10వ తేదీన నాగార్జునసాగర్‌లో 'వరుణ యాగం' నిర్వహించను న్నట్లు తెలిపారు. యాదగిరిగుట్ట అర్చకుల ఆధ్వర్యం లో నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం నాణ్యమైన 6 కిలోల సన్నబియ్యం అందిస్తోందని, నిత్యావసర వస్తువుల సరఫరాపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల మెస్ ఛార్జీలను 40 శాతం పెంచామని చెప్పారు. బాలికలకు కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తొండ గ్రామంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను ఎనిమిది నెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఇరిగేషన్ సీఈ నాగభూషణం, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర సాగునీటి ప్రణాళికను ప్రకటించాలి

- సాగర్, గోదావరి సహా జల వనరులపై స్పష్టత ఇవ్వాలి
- నీటి విడుదలకు ముందస్తు షెడ్యూల్ ప్రకటించాలి
- రైతులు పంటల సాగుపై ముందస్తు నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపట్టాలి
- మాజీ మంత్రి పువ్వాడ




**ప్రజానావ, ఖమ్మం:** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సాగునీటి లభ్యత, వినియోగం, నీటి విడుదలపై రైతులకు ప్రభుత్వం స్పష్టమైన సమాచారం అందించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పంటల సాగుకు అవసరమైన నీటి లభ్యతపై ముందస్తు స్పష్టత ఇవ్వడంతో పాటు రైతులు తమ పంటల సాగుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకునేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. వర్షపాతంలో హెచ్చుతగ్గులు చోటుచేసుకునే పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను శాస్త్రీయంగా, ప్రణాళికాబద్ధంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. సాగర్, గోదావరి, మున్నేరు, వైరా, పాలేరు, కిన్నెరసాని తదితర జల వనరుల్లో నీటి లభ్యతను ఎప్పటికప్పుడు అంచనా వేసి, ఆయకట్టు రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని సూచించా రు. ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు ఎంత, ఎప్పుడు నీటిని విడుదల చేస్తారు, ఏ ప్రాంతా లకు ఎంత మేరకు నీరు అందుబాటులో ఉంటుంది అనే వివరా లను ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షించి అధికారికంగా ప్రకటించాలని కోరారు. నీటి విడుదలకు సంబంధించి ముం దస్తు షెడ్యూల్‌ను ప్రకటిస్తే రైతులు పంటల ఎంపిక, సాగు సమయం, నీటి వినియోగంపై సరైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి నిర్వహణ, నీటి లభ్యతపై ఎలాంటి అనిశ్చితి లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడితే రైతులు నష్టపోకుండా పంటల సాగును ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# నీళ్లపై నిరంజన్‌రెడ్డి ఆరోపణలు అవాస్తవం

- ఆగస్టు 1 నుంచే మోటర్లు నడుస్తున్నాయి
- ఆగస్టు 7న కాలువలకు సాగునీరు విడుదల
- మూడు పంపులతో 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- రైతులకు నీటి సరఫరా కొనసాగుతోంది: ఎమ్మెల్యే మేఘారెడ్డి




**ప్రజానావ, వనపర్తి:** రైతులకు సాగునీరు అందించడం లేదని, కృష్ణా నదిలో వరదలు వచ్చినప్పటికీ ప్రభుత్వం నీటిని వినియోగించు కోవడం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్రంగా ఖండించారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా రాజకీయ విమర్శలు చేయడం బాధ్యతారాహిత్యమని ఆయన విమర్శించారు. శనివారం వనపర్తి పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచే మోటర్లు నడుస్తున్నాయని, ఆగస్టు 7న కాలువలకు సాగునీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మూడు పంపుల ద్వారా 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, రైతులకు సాగునీటి సరఫరా కొనసాగుతోందని వివరించారు. నీటి లభ్యత, పంపుల నిర్వహణ, కాలువలకు నీటి విడుదల వంటి అంశాల్లో ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపడుతోందన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వడం లేదంటూ నిరంజన్‌రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని మేఘారెడ్డి అన్నారు. రైతులకు సాగునీరు అందించేం దుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనించాలని, రాజకీయ విమర్శల కంటే వాస్తవ పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు.



## ఘనంగా స్వర్ణ తులసీ దళార్చన

**ప్రజానావ, భద్రాచలం:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శనివారం స్వామివారి నిత్య సేవలు, స్వర్ణ తులసీ దళార్చనను వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకే అర్చక స్వాములు ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆరాధన, అర్చన, బాలభోగం, నివేదన తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం ప్రత్యేక సేవల్లో భాగంగా స్వామివారిని స్వర్ణ తులసీ దళాలతో అర్చించి, ప్రత్యేక కవచాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ మిథిలా ప్రాంగణంలోని ప్రత్యేక శ్రీరామసేవ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ పుణ్యాహవాచనం, యజ్ఞోపవీత ధారణ తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామివారికి ప్రవరణ పట్టించి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం సేవల్లో భాగంగా స్వర్ణ తులసీ దళార్చనను ఘనంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం 'జై శ్రీరామ్.. జై జై శ్రీరామ్' నినాదాలతో మార్మోగింది. అనంతరం అర్చక స్వాములు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కే. దామోదర్‌రావు, ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ లింగాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# మందపల్లిలో ఘనంగా పోచమ్మ బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు
- రెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలి
- పేద రెడ్ల సంక్షేమానికి నిధులు కేటాయించాలి
- జిల్లా జేఏసీ కార్యదర్శి పాతూరి వెంకటరెడ్డి



**ప్రజానావ, సిద్దిపేట:** సిద్దిపేట అర్బన్ మండలం మందపల్లి గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, రైతులు సుఖసంతో షాలతో ఉండాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు పోచమ్మ అమ్మవారిని ప్రార్థించారు. బోనాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా రెడ్డి జేఏసీ కార్యదర్శి పాతూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ పేద రెడ్ల సంక్షేమం కోసం ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో కమిటీ ఏర్పాటు చేయకపోవడం, అవసరమైన నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. కార్పొరేష న్ ఏర్పాటుతో పేద రెడ్డి కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా అండ లభిస్తుందని ఆశించినప్పటికీ కార్యాచరణ ముందుకు సాగడం లేదన్నారు. దీంతో పేద కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇకపై ఆలస్యం చేయకుండారెడ్డి కార్పొరేషన్‌కు వెంటనే పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి తగిన నిధులు కేటాయించాలని పాతూరి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. అర్హులైన పేద రెడ్డి కుటుంబాలకు విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక సహాయం అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి పారదర్శక విధానంలో సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు అందేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోచమ్మ బోనాల కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా లభించి గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం బాగుండాలని ప్రార్థనలు చేశారు.

# సదాశివపేటలో దొంగల బీభత్సం

- శ్రీ భవానీమాత ఆలయంలో హుండీ చోరీ
- హుండీని పగలగొట్టి నగదు అపహరణ.. సీసీ కెమెరాల పరిశీలన
- నెల రోజులుగా వరుస దొంగతనాలతో స్థానికుల్లో ఆందోళన

**ప్రజానావ, సంగారెడ్డి:** సదాశివపేటలో దొంగలు వరుస చోరీలకు పాల్పడుతుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గురునగర్ కాలనీలోని శ్రీ భవానీమాత దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీని పగలగొట్టి అందులోని నగదును అపహరించారు. అనంతరం హుండీని ఆలయానికి సమీపంలో పడేసి అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న సదాశివపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలయంలో, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ దొంగల ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. నెల రోజుల వ్యవధిలో కాలనీలో వరుసగా దొంగతనాలు చోటుచేసుకోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేసి రాత్రివేళల్లో గస్తీ పెంచడంతో పాటు వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగలను త్వరగా పట్టుకుని దొంగతనాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# దండుపల్లిలో డీసీఎం - బైక్ ఢీ.. ఇద్దరు మృతి

- మరో కార్మికుడికి తీవ్ర గాయాలు
- మృతులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన తన్మన్, కమలేష్‌గా గుర్తింపు
- ప్రమాదంపై పోలీసుల దర్యాప్తు

**ప్రజానావ, మెదక్:** మనోహరాబాద్ మండలం దండుపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందగా, మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. దండుపల్లిలోని మదీనా చికెన్ సెంటర్ సమీపంలో స్కూటీపై వెళ్తున్న ముగ్గురు కార్మికులను ఎదురుగా వేగంగా వచ్చిన డీసీఎం వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన తన్మన్ (20), కమలేష్ (22) అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరో కార్మికుడు విశాల్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించారు. మృతదేహాలను తూప్రాన్ ప్రభుత్వ మార్చురీకి తరలించారు. మృతులు, గాయపడిన వ్యక్తి ఏపీఎంఎల్ పరిశ్రమల్లో కార్మికులుగా పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.




# వేతన కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి

- నాలుగు లేబర్ కోడ్‌లను బొగ్గు పరిశ్రమల్లో అమలు చేయొద్దు
- 10న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాను జయప్రదం చేయండి.. జేఏసీ నాయకులు

**ప్రజానావ, రామగుండం :** దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న బొగ్గు గని కార్మికులకు, ఉద్యోగులకు జీతాలు, అలవెన్సుల పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే నియమించాలని,బొగ్గు పరిశ్రమల్లో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయొద్దని డిమాండ్ చేస్తూ ఆగస్టు 10న దేశవ్యాప్తంగా ఉన్న బొగ్గు గనుల్లో ఆందోళనకార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు జాతీయ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.శనివారం గోదావరి ఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసి రెడ్డి సీతారామయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి, ఐఎన్టీయుసి నాయకులు గడ్డం క్రిష్ణ లు మాట్లాడారు. బొగ్గు పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు జూలై 1 నుంచి 12వ వేతన కాల పరిమితి మొదలైందని కానీఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం కమిటీ వేయ లేదని వారు ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో 51 శాతం ఓట్లు ఏ సంఘానికి రాకుంటే అధికారులే కమిషన్ ఏర్పాటు చేసి వారికి నచ్చినట్లు గా వేతనాల పెంపు చేపడుతార న్నారు.దీంతో కార్మిక వర్గం తీవ్ర అన్యాయానికి గురవుతుందని పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా అన్ని బొగ్గు గనుల్లో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల పై ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గని కార్మిక సంఘాలు నిర్ణయించాయని, అందులో భాగంగా ఈ నెల 10 న సింగ రేణి వ్యాప్తంగా అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని,కార్మిక వర్గం అధిక సంఖ్య లో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, ఏఐటియుసి బ్రాంచి నాయకులు దాసరి శ్రీనివాస్, బిట్టి వెంకటేశ్వర్లు,ఏ.వి.ఎస్ ప్రకాశ్,రాజేశ్వర్ రావు, దేవయ్య,ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్, ఆయా కార్మిక సంఘాల నాయకులు సిఐటియు నుంచి శివరాం రెడ్డి,రాజమౌళి,నరహరి రావు,ప్రవీణ్,ఐఎన్టీయుసి నుంచి వెంకటేశ్వర్లు,రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

Singareni news

# సింగరేణి మారుపేర్ల బాధితుల పోరుబాట

- రెండో రోజుకు చేరిన నిరసన దీక్ష
- "మా ఉద్యోగాలు మాకు వెంటనే ఇవ్వాలి".. భిక్షాటన దీక్షతో నిరసన



**ప్రజానావ, రామగుండం :** సింగరేణి మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజుకు చేరుకుంది. మారుపేర్లు, విజిలెన్స్ పెండింగ్ కేసుల నిర్వాహక కమిటీ అధ్యక్షుడు లక్కా శ్రావణ్ గౌడ్ నేతృత్వంలో ఈ ఆందోళన కొనసాగుతోంది. రెండో రోజు నిరసనలో భాగంగా బాధితులు భిక్షాటన దీక్ష చేపట్టి వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. "మా ఉద్యోగాలు మాకు వెంటనే ఇవ్వాలి" అంటూ సింగరేణి యాజమాన్యం, సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఎప్పటి నుంచో మారుపేర్ల బాధితులకు సలహాలు, సూచనలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ సైతం బాధితులకు సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఆర్జీ–1 వైస్ ప్రెసిడెంట్ అరెల్లి పోషం, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్, బ్రాంచ్ సెక్రటరీ పీ. క్రాంతికుమార్, టూ–ఏ పిట్ సెక్రటరీ సంపత్ తదితర నాయకులు పాల్గొని నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. మారుపేర్ల బాధితుల ఉద్యోగ సమస్యను తక్షణమే పరిష్కరించి, తమ ఉద్యోగాలు తమకు తిరిగి ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి

- 10న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా
- సెప్టెంబర్ 12న రాంచీ సదస్సులో స్పష్టత రాకుంటే సమ్మె తప్పదు
- జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నేతల హెచ్చరిక




**ప్రజానావ, జయశంకర్ భూపాలపల్లి:** సింగరేణి యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం వెంటనే 12వ వేజ్ బోర్డు వేతన కమిటీని ఏర్పాటు చేసి, ప్రక్రియను వేగంగా పూర్తి చేసి అమలు చేయాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, సీఐటీయూ నాయకుడు మంద నర్సింగరావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు జోగబుచ్చయ్య, హెచ్ఎంఎస్ నాయకుడు నరేష్ తదితరులు ఏఐటీయూసీ కొమురయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోల్‌ఇండియా పరిధిలో 12వ వేజ్ బోర్డు కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 10న సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామ్‌చందర్, ఐలయ్య, బీమనాదుని సత్యనారాయణ, రామచందర్, సీఐటీయూ నాయకులు దుద్దేల సాయిలు, రమేష్, హెచ్ఎంఎస్ నాయకుడు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# రజకుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజానావ, మంచిర్యాల :** చెన్నూర్ పట్టణ కేంద్రంలోని రజకుల సమస్యల పైన ఈరోజు ఇంటింటి, సర్వే కార్యక్రమం మొదలుపెట్టడం జరిగింది. రజక వృత్తిదారుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వనికి తెలియ జేయడం కోరకు రజక వృత్తిదారులకు దోబీ ఘాట్ స్థలం కేటాయించి పట్టణ కేంద్రానికి, మోడ్రన్ దోబీ ఘాట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటివరకు ఎలాంటి రుణాలు రాలేదని తెలిపారు. పాత సొసైటీలను పునరుద్ధరణ చేసి రజకులకు రజక ఫెడరేషన్ ద్వారా రుణాలు ఇవ్వాలని కోరారు. ఈ సర్వే రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందని. ఆగస్టు 15 తేదీలోపు పూర్తి, సర్వే చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల మధుకర్ పాల్గొని ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, తదితరులు పాలుగోన్నారు.

# సిరిసిల్లలో విచ్చలవిడిగా జేబు దొంగలు

- నిరంతరం రద్దీగా ఉండే హైదరాబాదు బస్సు ప్రయాణికులే టార్గెట్
- సిరిసిల్ల ప్రయాణికులకు రాజధాని బస్సుల కొరతతో పాత బస్టాండ్ ను కేంద్రంగా ఎంచుకున్న పిక్ పాకెటర్లు
- కొరవడిన పోలీసుల నిఘా

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ లో జేబు దొంగలు స్వైర విహారం చేస్తున్నారు. సిరిసిల్ల నుండి హైదరాబాద్ కు వెళ్లే ప్రయాణికుల పాట్లను ఆసరా చేసుకుని జేబు దొంగలు తమ చేతివాటం ప్రయోగిస్తున్నారు. కుటుంబాలతో రిజర్వేషన్ లేకుండా ప్రయాణించే ప్రజలు బస్సులో సీట్లను దక్కించుకోవాలన్న దృష్టి, ఆశలతో రద్దీలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులను లక్ష్యంగా చేసుకొని జేబు దొంగలు వారి జేబులోని పర్సుల దొంగతనాలకు పాల్పడుతున్నారు. జేబు దొంగలలో తాజాగా మహిళా దొంగలు రంగప్రవేశం చేయడం తో దొంగతనాల బాధితుల సంఖ్య పెరుగుతున్నది. వివాహాలకు, పండుగలకు, ఫంక్షన్లకు, ఆసుపత్రులకు వెళ్లే ప్రయాణికులు, చదువుల కోసం వెళుతున్న విద్యార్థులు డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అయితే తమ ప్రయాణం ఆగిపోతుందని, ప్రయాణానికి ఆటంకాలు వస్తాయనే కారణాలతో ఎలాంటి పోలీసులు ఫిర్యాదు లేకుండానే గమ్మనకుండా, ఎవరికి చెప్పుకోలేని పరిస్థితుల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోవడంతో జేబు దొంగల ఆటలు కొనసాగుతున్నాయి. గతంలో బస్సు స్టేషన్లలో రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీసులు దొంగతనాల పట్ల నిఘా కొనసాగించేవారు. అనుమానితులను పట్టుకొని దొంగతనాలను కట్టడి చేసేవారు. ప్రస్తుతం వేగంగా దూసుకెళుతున్న సాంకేతిక ప్రపంచంలో సైబర్ నేరాలు, గంజాయి మత్తు పదార్థాలు పెచ్చు పెరిగిన నేపథ్యంలో పోలీసుల నిఘా అంతా వీటిపైనే కేంద్రీకృతం కావడంతో పాతకాలం నాటి జేబు దొంగతనాల పట్ల దృష్టిని పెట్టలేక పోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ కు వెళ్లే ప్రయాణికులకు సిరిసిల్ల నుండి నేరుగా బస్సులు లేకపోవడం, వయా వేములవాడ నుండి వచ్చే బస్సులలో రిజర్వేషన్ లు కలిగి ఉండడం, మిగిలిన సీట్లలో అక్కడే నిండిపోవడంతో సిరిసిల్లకు వచ్చేసరికి బస్సులో సీట్లు దొరకక సిరిసిల్ల ప్రయాణికులు కొన్ని సంవత్సరాలుగా అనేక అవస్థలకు గురవుతున్నారు. వీటిపై విజ్ఞప్తులు చేస్తున్న సిరిసిల్ల నుంచి ఒకటి, రెండు మినహా హైదరాబాద్ కు బస్సులు నడపడం లేదు. దీనితో పాత బస్టాండ్ లో హైదరాబాద్ బస్సుల్లో రద్దీ పెరిగి, దొంగలకు ఉపాధి మార్గంగా మారింది. ప్రస్తుతం పోలీసు శాఖ పాత బస్టాండ్ లో రద్దీతో నిలబడే హైదరాబాద్ బస్సుల వద్ద నిఘా కట్టుదిట్టం చేయాలి. మరోవైపు సిరిసిల్ల డిపో నుండి హైదరాబాదుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

# పీఆర్సీ ప్రకటించాలి.. పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

- జీఓ 25ను సవరించకుంటే దశలవారీ ఉద్యమం
- పీఆర్సీ వచ్చేవరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు
- ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా.. స్పందించకుంటే చలో అసెంబ్లీ




**ప్రజానావ, కామారెడ్డి:** ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పాటు 15వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు చింతల లింగం అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పీఆర్సీ ప్రకటించే వరకు ఉపాధ్యాయులు ప్రతిరోజూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు జిల్లా కేంద్రాల్లో ధర్నాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర, జిల్లా బృందాలు పర్యటించి జిల్లా కేంద్రాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహిస్తాయని, హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపడతామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షుడు చింతల లింగం మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న వర్క్ అడ్జస్ట్మెంట్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, జీఓ 25 నిబంధనల ప్రకారమే జరగాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారంలో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జీఓ 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులను, 50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. నూతన జిల్లాలకు డీఈఓలు, రెవెన్యూ డివిజన్లకు డిప్యూటీ ఈఓలు, అన్ని మండలాలకు ఎంఈఓ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని, టెట్‌లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలని, ప్రత్యేక టెట్‌ను సబ్జెక్టుల వారీగా నిర్వహించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి, మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలని, జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, జీఓ 190ను అమలు చేయాలని కోరారు. విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రతి నెలా రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేయడంతో పాటు హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నల్ల బ్యాడ్జీల నిరసన విజయవంతమైందని నాయకులు తెలిపారు. పీఆర్సీ ప్రకటించే వరకు ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై, భోజన విరామ సమయంలో పాఠశాలల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు తృప్తి వాసు, జిల్లా కార్యదర్శులు నాగభూషణం, నరేందర్, గోపు శ్రీనివాస్, సోలేటి నారాయణ, హరీష్, ఫెడరేషన్ సీనియర్ నాయకులు కందుకూరి శ్రీనివాస్, రాజశేఖర్, కృష్ణమూర్తి, సునీల్ కుమార్, కామారెడ్డి మండల అధ్యక్షుడు గ్యార బాబయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, గాంధారి మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, అశోక్ బలరాం తదితరులు పాల్గొన్నారు.



# థానాకాన్-2026 మహాసభను జయప్రదం చేయండి

**ప్రజానావ, వరంగల్:** వరంగల్ ఆరెపల్లిలోని వజ్ర గార్డెన్‌లో నిర్వహించనున్న థానాకాన్–2026 రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (థానా) రాష్ట్ర అధ్యక్షుడు డా. ముక్కా దిలీప్‌కుమార్ పిలుపునిచ్చారు. వరంగల్ ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో థానాకాన్ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. 2026–27 సంవత్సరానికి థానా రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన డా. పి. ప్రవీణ్‌కుమార్ మహాసభ లో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించ నున్నట్లు వెల్లడించారు. మహాసభకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎంపీ డా. కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజుతో పాటు పలువురు కలెక్టర్లు, డీఎంహెచ్‌ఓలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు డా. దిలీప్‌కుమార్ తెలిపారు. ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్య నిపుణులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో థానా ప్రధాన కార్యదర్శి డా. ఎల్. నాగేశ్వర్‌రావు, కోశాధికారి డా. వి. నరేష్‌కుమార్, డా. రమేష్, డా. రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# బ్యాంకు రుణాలపై విపక్షాల ఆరోపణలు అవాస్తవం

- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు
- రూ.450 కోట్ల రుణానికి ఆమోదం తీసుకున్నది రూ.109 కోట్లే: ఎమ్మెల్యే

**ప్రజానావ, మంచిర్యాల:** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నార్తిన్ హోటల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భం గా బ్యాంకు రుణాలు, అప్పుల చెల్లింపుల విషయంలో విపక్ష నాయకులు చేస్తున్న ఆరోపణలను ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మరోసారి ఖండించారు. రూ.450 కోట్ల రుణానికి ఆమోదం లభించినప్పటికీ, తాను కేవలం రూ.109 కోట్ల రుణాన్ని మాత్రమే తీసుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. తీసుకున్న రుణానికి సంబంధించి వడ్డీ, అసలు కలిపి బ్యాంకు రుణాన్ని చెల్లించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు చిట్ల సత్యనారాయణ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య–మహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, లక్షెట్టిపేట్ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, లక్షెట్టిపేట్ మండల అధ్యక్షులు, సర్పంచ్ నలిమెల రాజు, లక్షెట్టిపేట్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీతో పాటు జిల్లా నాయకులు, మహిళా నాయకురాలు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సగం వాటాతోనే సామాజిక న్యాయం

- బీసీ దళపతి, కోటి ఉత్తరాల ఉద్యమ నేత డాక్టర్ పరికిపండ్ల అశోక్
- బీసీ మేనిఫెస్టో పుస్తకాల ఆవిష్కరణ
- సిరిసిల్లలో బీసీ చైతన్య కార్యక్రమం



**ప్రజానావ, సిరిసిల్ల :** సగానికి పైగా ఉన్న బీసీలకు మేమెంతో మాకు అంత వాటా దక్కినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమని, బీసీ దళపతి – బీసీల రిజర్వేషన్లపై ప్రధానమంత్రి కి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ నేత డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీసీ ఉద్యమకారుడు గాధ మైసయ్య అధ్యక్షతన జరిగిన బిసి చైతన్య కార్యక్రమంలో డాక్టర్ పరికిపండ్ల అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో బీసీలకు సముచిత న్యాయం దక్కకపోవడం అన్యాయమని, అడవిలో పులులను లెక్కిస్తారు, రోడ్ల వెంట చెట్లను లెక్కిస్తారు, జంతువులను లెక్కపెట్టి వాటి నెంబర్లను చెవులకు అంటిస్తారు. కానీ సగానికి పైగా ఉన్న బీసీల లెక్కలను తేల్చకపోవడం సిగ్గుచేటని డాక్టర్ అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీల గురించి సంపూర్ణ అవగాహన కల్పించే బీసీ మ్యానిఫెస్టో పుస్తకాలను సిరిసిల్ల బీసీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అఖిలభారత పద్మశాలి సంఘం నేత, ఆంధ్రప్రదేశ్ రాజమండ్రి నివాసి చిందం రాధా కిషన్ మాట్లాడుతూ బీసీ లందరూ ఐక్యం కావలసిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకారపు మహేష్, గుడ్ల విష్ణు, దూస సత్తయ్య, బీసీ సంఘాల, చేనేత పద్మశాలి నాయకులు పాల్గొన్నారు.



# భీమేశ్వర ఆలయానికి పోటెత్తిన భక్తులు

**ప్రజానావ, వేములవాడ:** వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించారు. అభిషేకాలు, అన్నపూజలు, సత్యనారాయణ వ్రతం, నిత్యకల్యాణం, చండీహోమం తదితర ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లు చేసి దర్శనం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.



# ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా

- 143 స్పాట్ చలాన్లు.. రూ.1.51 లక్షల జరిమానా వసూలు
- నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌పై ప్రత్యేక నిఘా.. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు
- హెల్మెట్ తప్పనిసరి.. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని పోలీసుల సూచన

**ప్రజానావ, కామారెడ్డి:** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కామారెడ్డి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌ఓ నరహరి పర్యవేక్షణలో, ఆర్ఎస్ఐ ట్రాఫిక్ చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల రోడ్, అశోక్‌నగర్ ఎక్స్‌రోడ్, టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు నిబంధనలకు విరుద్ధంగా, అసంబద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసిన వాహనాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై మొత్తం 143 స్పాట్ చలాన్లు నమోదు చేసి రూ.1,51,790 జరిమానా వసూలు చేశారు. తనిఖీల్లో డ్రైవింగ్ లైసెన్స్ వెంట లేకుండా వాహనం నడిపినవి 146, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపినవి 17, నిబంధనలకు విరుద్ధంగా లేదా అసంబద్ధమైన నంబర్ ప్లేట్లు కలిగినవి 44, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 5, హెల్మెట్ లేకుండా వాహనం నడిపినవి 3గా గుర్తించారు. వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. నంబర్ ప్లేట్‌ను ట్యాంపరింగ్ చేయడం, అంకెలను మార్చడం, స్పష్టంగా కనిపించకుండా చేయడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు సైబర్ నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ పోలీసులు అవగాహన కల్పించారు.

# విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఫ్రెషర్స్ డే వేడుకల్లో లైవ్ నరేష్ నాయక్

**ప్రజానావ, కోనరావుపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండలం మరిమండ్ల, గ్రామంలోని ఈఎంఆర్ఎస్ పాఠశాలలో శనివారం రోజున నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి లంబాడీల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ జీవితంలో ఎంతో ముఖ్యమైనదని, కొత్తగా పాఠశాలలో చేరిన విద్యార్థులు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. విద్యతో పాటు క్రమ శిక్షణ, మంచి నడవడిక, సమయపాలన, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని సూచించారు. గిరిజన ప్రాంతాల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని, భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షిం చారు. "ప్రతి గిరిజన విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని, ఆ లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయాలి. విద్యే మన అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమా లు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్ ఎస్ యాదవ్, వైస్ ప్రిన్సిపల్ భావన, ఉపాధ్యాయులు, విద్యార్థిని,విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మోదీకి జేడీ వాన్స్ ఫోన్

- వాణిజ్యం, రక్షణ, ఖనిజాల రంగాల్లో సహకారంపై చర్చ
- ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా అభిప్రాయాలు పంచుకున్న నేతలు

**న్యూఢిల్లీ:** భారత్‌–అమెరికా సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించే అంశాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చర్చించారు. శనివారం వాన్స్ ఫోన్‌లో మోదీతో మాట్లాడారు. ఈ సందర్భం గా వాణిజ్యం, రక్షణ, ఇంధన భద్రతతోపాటు కీలక, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, కీలక ఖనిజాల రంగాల్లో సహకారాన్ని మరింత పెంచే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై కూడా మోదీ, వాన్స్ తమ అభిప్రాయాలను పంచుకున్నారు. టర్కియే, సౌదీ అరేబియా, పాకిస్థాన్ ఇటీవల పరస్పర రక్షణ ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఈ చర్చకు ప్రాధాన్యం ఏర్పడింది. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించినట్లు సమాచారం.

### వాణిజ్య ఒప్పందంపై స్పష్టత కరవు

తాజా ఫోన్ సంభాషణలో ప్రతిపాదిత భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ జరిగిందా లేదా అన్నది వెంటనే స్పష్టంకాలేదు. జూన్‌లో ఫ్రాన్స్‌లో మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ సందర్భంగా సమతుల్య, పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేయాలని ఇరు దేశాల అధికారులను ఆదేశించారు. ఇటీవల భారత్‌పై అమెరికా భారీ సుంకాలు విధించడం, 2025 మేలో భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణల విషయంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం చూపాయి. హెచ్–1బీ వీసా ఫీజు పెంపు, అమెరికా కొత్త వలస విధానాలు కూడా ఇరు దేశాల మధ్య సవాళ్లను పెంచాయి. అయితే, ఇటీవలి నెలల్లో ద్వైపాక్షిక సంబంధాలను తిరిగి బలోపేతం చేసేందుకు భారత్, అమెరికా ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

### వాన్స్ దంపతులకు అభినందనలు

అంతకుముందు ప్రధాని మోదీ వాన్స్, ఆయన భార్య ఉష దంపతులకు ఇటీవల కుమారుడు జన్మించడంతో అభినందనలు తెలిపారు. భారత్–అమెరికా మధ్య ఉన్నతస్థాయి సంప్రదింపులు కొనసాగుతున్నాయని ఇరువురు నేతలు పేర్కొన్నారు. ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించినట్లు భారత ప్రభుత్వం తెలిపింది.

# జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్ధృతం

- నియామక పరీక్షల్లో అక్రమాలపై 15వ రోజుకు చేరిన నిరసనలు
- ప్రభుత్వంతో చర్చలు విఫలం
- డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్న విద్యార్థులు
- నేడు మరోసారి చర్చలు జరపనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం





**రాంచీ:** నియామక పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలు జరిగాయంటూ జార్ఖండ్‌లో విద్యార్థులు చేపట్టిన ఆందోళన 15వ రోజుకు చేరింది. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం శనివారం పలు దఫాలుగా విద్యార్థి సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపింది. అయితే ప్రతిష్టంభన తొలగకపోవడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు మరోసారి విద్యార్థి ప్రతినిధులతో చర్చలు జరపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వం వేర్వేరు విద్యార్థి సంఘాలతో చర్చలు జరపడంపై జేపీఎస్సీ–జేఎస్ఎస్‌సీ రిఫార్మ్స్ మంచ్ తీవ్రంగా స్పందించింది. ఉద్యమంలో కీలక పాత్ర లేని సంఘాలతో విడివిడిగా చర్చలు జరపడం ద్వారా విద్యార్థులను విభజించి, ప్రధాన డిమాండ్ల నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని మంచ్ నేత రవీంద్ర పాస్వాన్ ఆరోపించారు. విద్యార్థులంతా ఐక్యంగా ఉన్నారని స్పష్టం చేశారు. మంత్రులు దీపికా పాండే సింగ్, సుదివ్య కుమార్, చమ్రా లిండా, సంజయ్ ప్రసాద్ యాదవ్‌లతో కూడిన ప్రభుత్వ కమిటీ శనివారం ఎన్ఎస్‌యూఐ, జార్ఖండ్ ఛాత్ర మోర్చా (జేసీఎం), ఆదివాసీ ఛాత్ర సంఘ్ (ఏసీఎస్) ప్రతినిధులతో చర్చించింది. జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ నియామక ప్రక్రియలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తెలిపింది.

### పరీక్షల రద్దు.. దర్యాప్తు

14వ జేపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షను రద్దు చేయాలని జేసీఎం డిమాండ్ చేసింది. అనుమానాస్పదంగా ఉన్న జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ పరీక్షలన్నింటిపై 90 రోజుల్లో సీఐడీ దర్యాప్తు జరపాలని ఎన్ఎస్‌యూఐ కోరింది. జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) తరహాలో జార్ఖండ్ టెస్టింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గిరిజన, ప్రాంతీయ భాషలను నియామక పరీక్షల్లో అర్హత పేపర్లుగా చేర్చాలని ఏసీఎస్ కోరింది. చర్చలు జరిగినప్పటికీ తమ అన్ని డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగుతుందని విద్యార్థులు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆదివారం నాటికి సానుకూలంగా స్పందించకపోతే ఆగస్టు 10న అసెంబ్లీని ముట్టడిస్తామని ప్రకటించారు. మరోవైపు ఏబీవీపీ ఆగస్టు 11న ప్రత్యేకంగా అసెంబ్లీ మార్చ్‌కు పిలుపునిచ్చింది. జేపీఎస్సీ పరీక్షల్లో అవకతవకల ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు 19 మందిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. మాజీ ప్యానెల్ చైర్‌పర్సన్ ఎల్. ఖియాంగ్తేను జూలై 28 నుంచి నాలుగుసార్లు ప్రశ్నించినట్లు వెల్లడించారు.

# మెటా హోదాపై కేంద్రం పరిశీలన

- 'ఎవరికి ఏ కంటెంట్ చూపించాలో' నిర్ణయిస్తే పబ్లిషర్‌గా పరిగణించాలా?
- రెకమండేషన్ సిస్టం, పెయిడ్ ప్రమోషన్, డీప్‌ఫేక్‌లపై ప్రశ్నలు

**న్యూఢిల్లీ:** మెటా రెకమండేషన్ వ్యవస్థ ద్వారా 'ఏ కంటెంట్ ఎవరికి చూపించాలో' నిర్ణయించడం, డబ్బులు తీసుకుని కంటెంట్‌ను ప్రమోట్ చేయడం ఇంటర్మీడియరీ హోదాకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. ప్లాట్‌ఫామ్ కంటెంట్ ఎంపికలో క్రియాశీల పాత్ర పోషిస్తే పబ్లిషర్‌గా పరిగణించాలా? అన్నదానిపై న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకునే అవకాశముంది. అలా అయితే ఐటీ చట్టంలోని సెక్షన్ 79 కింద లభించే 'సేఫ్ హార్బర్' రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. డీప్‌ఫేక్‌లు, లేబుల్ చేయని ఏఐ కంటెంట్, పిల్లల లైంగిక దోపిడీ కంటెంట్ వ్యాప్తిపైనా కేంద్రం మెటాను ప్రశ్నించింది. కంటెంట్ మోడరేషన్‌లో మానవ పర్యవేక్షణ పెంచాలని, భారతీయ భాషలు, స్థానిక పరిస్థితులపై అవగాహన మెరుగుపరచాలని సూచించింది. ప్రధాని మోదీ ఫేస్‌బుక్ పోస్టును తాత్కాలికంగా పరిమితం చేసిన ఘటనపైనా మెటా వివరణ ఇచ్చింది. భారత చట్టాలను పాటిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. తమ లక్ష్యం సెన్సార్‌షిప్ కాదని, చట్టాల అమలును నిర్ధారించడమేనని కేంద్రం స్పష్టం చేసింది.

# షరతులు పాటిస్తేనే హర్మూజ్ ఓపెన్

- అమెరికా తన వైఖరిని మార్చే వరకూ జలసంధి తెరవబోం
- తేల్చిచెప్పిన ఇరాన్
- యూఏఈ నౌకపై క్షిపణి దాడి
- యెమెన్‌లో హూతీలపై దాడులు



**దుబాయ్:** హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలంటే అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా ఇకపై ఇరాన్‌ను బెదిరించకూడదని, తమపై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని డిమాండ్ చేసింది. ఇరాన్ నౌకాశ్రయాలపై నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయడంతోపాటు, ఈ ప్రాంతం నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని కోరింది. యుద్ధ నష్టాలకు పూర్తిగా పరిహారం చెల్లించాలని, ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులను ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని డిమాండ్లు చేసింది. హర్మూజ్‌లో నౌకల రాకపోకలకు మార్గాన్ని నిర్ణయించే అంశంపై ఒమన్‌తో ఒప్పందానికి దగ్గరగా వచ్చామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తెలిపారు. అయితే జలసంధిని తెరవడం ఇతర షరతులపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఒమన్ చర్చలు సానుకూల వాతావరణంలో కొనసాగుతున్నాయని తెలిపింది.

### హూతీలపై యెమెన్ సైన్యం దాడులు

ఇరాన్ మద్దతున్న హూతీ తిరుగుబాటుదారులపై యెమెన్ సైన్యం దాడులు చేసింది. ఇటీవల మధ్య, తూర్పు యెమెన్‌లో హూతీలు జరిపిన దాడులకు ప్రతిస్పందనగా ఈ చర్యలు చేపట్టినట్లు సైన్యం తెలిపింది. ఈ పరిణామాలు 2022లో ఏర్పడిన కాల్పుల విరమణ తర్వాత మళ్లీ అంతర్యుద్ధం చెలరేగే ఆందోళనను పెంచుతున్నాయి. ఇదిలాఉంటే టర్కియేలో కుర్దు తిరుగుబాటుదారులతో శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే బిల్లుకు పార్లమెంటరీ కమిటీ ఆమోదం తెలిపింది. పీకేకే సభ్యుల నిరాయుధీకరణ, పునరావాసానికి సంబంధించిన విధానాలను బిల్లులో పొందుపరిచారు. వచ్చే వారం పార్లమెంటు ఆమోదం పొందే అవకాశం ఉంది.

### యూఏఈ నౌకపై క్షిపణి దాడి

అబుదాబి ప్రభుత్వానికి చెందిన చమురు సంస్థ అడ్నాక్‌కు చెందిన నౌకపై హర్మూజ్ జలసంధిలో ఇరాన్ క్షిపణి దాడి చేసిందని యూఏఈ ఆరోపించింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని అడ్నాక్ తెలిపింది. ఫిబ్రవరిలో అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించినప్పటి నుంచి జలసంధి లో తమకు చెందిన డజనుకు పైగా నౌకలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిగాయని పేర్కొంది.

# న్యాయమంటే సమస్య పరిష్కారమే కాదు

- బాధితుడి గౌరవం, మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి
- స్థానిక అవసరాలకు అనుగుణంగా న్యాయ సేవలు
- సీజేఐ సూర్యకాంత్




**ఇండోర్:** సమర్థవంతమైన న్యాయప్రాప్తికి సంభాషణ, గౌరవం, సమ్మిళితం అత్యంత కీలకమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ అన్నారు. న్యాయ సహాయం అంటే ప్రజలకు కేవలం సమాచారం అందించడం కాదని, వారితో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకోవడమని స్పష్టం చేశారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నాల్సా) పశ్చిమ మండల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. వివిధ వర్గాల ప్రజల సమస్యలను వారి సొంత భాషల్లో వినాలని సీజేఐ సూచించారు. మధ్యప్రదేశ్‌లోని గిరిజన కుటుంబం, గోవాలోని మత్స్యకారులు, గుజరాత్‌లోని వలస కార్మికులు, ముంబయిలో న్యాయ సహాయం కోరే మహిళ ఎదుర్కొనే సమస్యలు ఒకేలా ఉండవని అన్నారు. అందువల్ల న్యాయ వ్యవస్థ స్పందన స్థానిక పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. ఒక కేసును పరిష్కరించడంతోనే న్యాయం పూర్తయినట్లు కాదని సూర్యకాంత్ అన్నారు. బాధితుడి బాధ, గౌరవం, మనోభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. పారాలీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు ప్రజలకు న్యాయం అందుతుందన్న విశ్వాసాన్ని కలిగించేలా వ్యవహరించాలని కోరారు. అణగారిన వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడమే న్యాయ సేవల సంస్థల పనితీరుకు అసలైన పరీక్ష అని పేర్కొన్నారు.

### తగ్గిన పెండింగ్ కేసులు

కోర్టుల్లో పెండింగ్ కేసుల పరిస్థితి 10–20 ఏళ్ల క్రితం ఉన్నంత తీవ్రంగా ఇప్పుడు లేదని సీజేఐ తెలిపారు. కేసుల జాప్యానికి అనేక కారణాలు ఉన్నాయని, వాటిని క్రమబద్ధంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. సాంకేతికత ఆధారంగా కేసుల త్వరిత పరిష్కారానికి చేపట్టిన చర్యలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని వెల్లడించారు. కొలీజియం సిఫారసులపై అడిగిన ప్రశ్నకు.. అది న్యాయ సేవల సంస్థకు సంబంధించిన కార్యక్రమం కాదని, ఆ అంశంపై తాను మాట్లాడబోనని తెలిపారు.



# హిమాచల్‌లో ఘోర బస్సు ప్రమాదం

- కొండ మార్గంలో అదుపుతప్పి కిందపడ్డ ప్రైవేటు బస్సు
- ఏడుగురు దుర్మరణం
- 11 మందికి గాయాలు.. ఆరుగురి పరిస్థితి విషమం

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. చంబా జిల్లాలో శనివారం ఉదయం 7.15 గంటలకు ప్రైవేటు బస్సు అదుపుతప్పి బోల్తాపడి కింది రోడ్డుపై పడటంతో ఏడుగురు ప్రయాణికులు మృతి చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. మృతుల్లో బస్సు డ్రైవర్, కండక్టర్ కూడా ఉన్నారు. బైరాగఢ్ నుంచి చంబా వెళ్తున్న బస్సు బైరాగఢ్–తీసా రహదారిలోని చాలుంజ్ మలుపు వద్ద ప్రమాదానికి గురైంది. 27 కిలోమీటర్ల ఈ కొండ మార్గం ఇరుకైన రహదారి, లోతైన లోయలతో ప్రమాదకరంగా ఉంటుంది. సచ్పాస్ వెళ్లే ప్రధాన మార్గాల్లో ఇది ఒకటి. బస్సు ప్రయాణికుల హాహాకారాలు విన్న స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఎన్‌డీఆర్ఎఫ్, పోలీసులు, హోంగార్డులు, అగ్నిమాపక, రెవెన్యూ సిబ్బందితో కూడిన బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని చంబాలోని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణంపై దర్యాప్తు కొనసాగుతోంది. మృతులను జగ్‌దేవ్ (50), దేశ్‌రాజ్ (35), జహ్‌దేహి (24), హర్‌దేహి (43), నీలం (34), డ్రైవర్ రూప్ సింగ్ (35), కండక్టర్ తేజ్‌సింగ్ (39)గా గుర్తించారు. గాయపడిన 11 మందిలో ఐదుగురు మైనర్లు ఉన్నారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ వర్షాకాలంలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జూన్ 30 నుంచి ఆగస్టు 7 వరకు రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 78మంది మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

# హనీట్రాప్‌లో ఐఏఎఫ్ అధికారి

**మహిళగా పరిచయమై సోషల్ మీడియా ద్వారా వల**

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్ హనీట్రాప్‌లో చిక్కుకుని సైనిక సమాచారాన్ని పంచుకున్నారనే ఆరోపణలపై భారత వైమానిక దళానికి చెందిన ఓ అధికారిని పోలీసులు అరెస్టు చేశారు. ఐఏఎఫ్ ఫిర్యాదు మేరకు అధికారిక రహస్యాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. దర్యాప్తులో భాగంగా పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఇంటెలిజెన్స్ వర్గాల తరఫున ఓ మహిళ సోషల్ మీడియా ద్వారా సదరు అధికారిని సంప్రదించినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం వీడియో కాల్స్, ఇతర డిజిటల్ వేదికల ద్వారా అతడితో సంబంధాలు కొనసాగించినట్లు వెల్లడించారు. ఈ క్రమంలో సైనిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని అధికారి పంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.

### మే 30న అరెస్టు

ఐఏఎఫ్ ఫిర్యాదు ఆధారంగా మే 30న అధికారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో అనుమానిత గూఢచర్య నెట్‌వర్క్‌తో ఆయనకు సంబంధాలు ఉన్నట్లు గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. దర్యాప్తు పూర్తిచేసిన అనంతరం జూలై 30న సంబంధిత కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# జెన్ జెడ్ కోసమే మంత్రి పదవి వీడా

- నీట్ ఆందోళనల్లో యువతను తప్పుదోవ పట్టించారు
- పదవి ముఖ్యం కాదు.. భారత్‌ను విశ్వగురుగా నిలిపేది యువతే
- కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**భువనేశ్వర్:** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై జరిగిన ఆందోళనల్లో జెన్ జెడ్ యువతను కొందరు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని బీజేపీ సీనియర్ నేత, సంబల్‌పూర్ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఈ కారణంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. జూలై 25న మంత్రి పదవికి రాజీనామా చేసిన అనంతరం తొలిసారిగా శనివారం ఆయన దీనిపై స్పందించారు. జీఎం యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడిన ప్రధాన్.. జెన్ జెడ్ యువతను తమ పిల్లలుగా అభివర్ణించారు. ప్రతి ఏడాది దేశంలో సుమారు రెండు కోట్ల మంది పిల్లలు జన్మిస్తున్నారని, గత పదేళ్లలో దాదాపు 20 కోట్ల మంది పుట్టారని చెప్పారు. వారికి ఎన్నో ఆశయాలు ఉన్నాయని, భారత్‌ను విశ్వగురుగా తీర్చిదిద్దే శక్తి వారిలో ఉందని పేర్కొన్నారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి మంత్రివర్గం నుంచి వైదొలగేందుకు అనుమతి కోరినట్లు తెలిపారు.

### 'వెనక్కి వెళ్లినా తిరిగొస్తా'

రైరాఖోల్‌లో జరిగిన మరో కార్యక్రమంలో మాజీ ఒడిశా ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్‌పై ప్రధాన్ విమర్శలు చేశారు. తనను 'గో బ్యాక్' అంటూ బీజేడీ కార్యకర్తలు నినదించడం బాధ కలిగించలేదన్నారు. ''నేను రైతు బిడ్డను. వెనక్కి వెళ్లమన్నా మళ్లీ వస్తా'' అని వ్యాఖ్యానించారు. తన వల్ల ఒడిశా ప్రజలకు ఎప్పుడైనా అవమానం కలిగిందా? అని ప్రశ్నించారు.

### ప్రధాన్‌పై బీజేడీ ఎదురుదాడి

విద్యార్థుల ఆందోళనలను పోలీసులు లాఠీచార్జి, టియర్ గ్యాస్‌తో అణచివేయడం వల్లే ధర్మేంద్ర ప్రధాన్‌పై విమర్శలు వచ్చాయని బీజేడీ సంబల్‌పూర్ జిల్లా అధ్యక్షుడు రోహిత్ పూజారి అన్నారు. దీనికి నవీన్ పట్నాయక్‌ను బాధ్యుడిని చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాల కారణంగానే ప్రధాన్‌కు చెడ్డపేరు వచ్చిందని విమర్శించారు. మరోవైపు, బీజేడీ యువజన, విద్యార్థి విభాగాల నిరసనలను అడ్డుకునేందుకు సంబల్‌పూర్ పోలీసులు సుమారు 30 మంది కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# యువతే దేశానికి అతిపెద్ద బలం

- వారిని 'చక్రవ్యూహం'లో బంధించారు
- విద్య ఉన్నా కొలువుల్లేవు
- పేపర్ లీకులు, నిరుద్యోగంతో భవిష్యత్తుకు ముప్పు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

**ప్రయాగ్‌రాజ్:** దేశ యువతే భారత్‌కు అతిపెద్ద బలమని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. యువత సృష్టించే డేటా 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థకు కీలకమవుతుందని పేర్కొన్నారు. అయితే యువత సామర్థ్యం, వారు సృష్టించే డేటా ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాలు పెద్ద పారిశ్రామిక సంస్థలకు చేరుతున్నాయని ఆరోపించారు. యువతను ఓ 'చక్రవ్యూహం'లో బంధించారని విమర్శించారు. శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని కేపీ గ్రౌండ్‌లో నిర్వహించిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అమెరికా, చైనా, రష్యాల గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతు న్నా.. భారత యువతకు ప్రపంచంలో ఎవరూ సాటిరారని రాహుల్ అన్నారు. భారత్‌లో భారీ యువ జనాభాతోపాటు ప్రపంచంలోనే అత్యధిక డేటా ఉందని పేర్కొన్నారు. యువత + డేటా కలిస్తే 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థ గా మారుతుందని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతకు ప్రజలు సృష్టించే డేటానే ఆధారమని.. ఆ డేటా యువతదైనా దాని ఆర్థిక ప్రయోజనాలు మాత్రం పెద్ద సంస్థలకు వెళ్తున్నాయని ఆరోపించారు. రీల్స్ చూడటం, వాట్సాప్‌లో సందేశాలు పంపడం, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో మునిగిపోవడం 21వ శతాబ్దపు వ్యసనంగా మారిందని రాహుల్ విమర్శించారు. యువతకు డేటా, సామర్థ్యం, శ్రమ ఉన్నా.. వాటి ద్వారా వచ్చే సంపద ఇతరుల చేతుల్లోకి వెళ్తోందని అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చిత్రాలను ప్రదర్శించారు.

### అదానీ, బీజేపీపై ఆరోపణలు

గత పదేళ్లలో గౌతమ్ అదానీ ఆదాయం 30 రెట్లు పెరిగిందని రాహుల్ ఆరోపించారు. ప్రభుత్వంతో ఆయనకు పరస్పర ప్రయోజన సంబంధాలు ఉన్నాయని విమర్శించారు. ఇదే సమయంలో బీజేపీ బ్యాంకు నిల్వలు సుమారు రూ.150 కోట్ల నుంచి రూ.10 వేల కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. బ్యూరోక్రసీ, మీడియా, న్యాయవ్యవస్థ, పారామిలటరీ, విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను నియమించడం ద్వారా యువత ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు.

### కష్టపడి చదివినా ఉద్యోగాల్లేవు

విద్య కోసం భారీగా ఖర్చు చేసి, ఏళ్ల తరబడి కష్టపడి చదివినా ఉద్యోగాలు దొరకడం లేదని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఖరీదైన విద్య, నిరుద్యోగం, పోటీ పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకులు, తయారీ రంగం క్షీణత, రుణాల లభ్యతలో ఇబ్బందులు, ఏఐతో ఉద్యోగాలకు ముప్పు వంటి అంశాలు యువత భవిష్యత్‌ను దెబ్బతీస్తున్నాయని అన్నారు. పేపర్ లీకుల కారణంగా ధనిక కుటుంబాలకు చెందినవారు ప్రశ్నపత్రాలు కొనుగోలు చేసి ప్రతిభావంతులైన యువతకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.విద్యార్థుల ఆందోళనల కారణంగానే మాజీ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు.

### ద్వేషం వద్దు.. ప్రేమతో పోరాడండి

భయాన్ని ఎదుర్కొని విద్యార్థులు తమ గొంతు వినిపించారని రాహుల్ అన్నారు. ద్వేషం, హింసకు తావివ్వకుండా ప్రేమతోనే వ్యవస్థను మార్చాలని యువతకు సూచించారు. చీకటిలో యువత వెలుగును వెలిగించిందని, భారతదేశ భవిష్యత్ యువత చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా కేపీ గ్రౌండ్‌లో నీరు, బురద ఏర్పడినప్పటికీ పెద్ద సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు కార్యక్రమానికి హాజరయ్యారు. రాహుల్ రాకకు ముందు ముంబైకి చెందిన ర్యాపర్ల నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమ ప్రచారంలో భాగంగా శుక్రవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన బైక్ ర్యాలీకి ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ నాయకత్వం వహించారు.

# రాహుల్ సభ అట్టర్ ఫ్లాప్

**ప్రయాగ్‌రాజ్/లక్నో:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ పర్యటనపై రాజకీయ దుమారం రేగింది. రాహుల్ 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమాన్ని ఉద్దేశించి నిర్వహించిన సభను ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య 'అట్టర్ ఫ్లాప్ షో'గా అభివర్ణించారు. సమాజ్‌వాదీ పార్టీ బహిరంగ మద్దతు, ఎస్పీ–కాంగ్రెస్ కూటమి పూర్తి బలంతో కార్యక్రమం నిర్వహించినప్పటికీ ప్రజ ల స్పందన అంతంతమాత్రంగానే ఉందని విమర్శించారు.

### నల్లజెండాల ప్రదర్శన

కేపీ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వెళ్లేందుకు ఆనంద్ భవన్ నుంచి రాహుల్ బయలుదేరిన సమయంలో కొందరు నల్లజెండాలు ప్రదర్శించారని స్థానిక కాంగ్రెస్ నేత ఇర్షాద్ ఉల్లా తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నారని చెప్పారు. నిరసనకు సంబంధించిన సమాచారం ముందుగానే స్థానిక పరిపాలన, లోకల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎల్ఐయూ)కు ఇచ్చినా చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని 'విద్యార్థుల కార్యక్రమం'గా చూపించి రాజకీయ వైఫల్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని మౌర్య విమర్శించారు. యువతకు సంబంధించిన అంశాలపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో యువత సమస్యలపై మౌనం పాటిస్తూ.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రం వాటిని లేవనెత్తుతోందని అన్నారు.

### 2027లో బీజేపీదే విజయం

ప్రయాగ్‌రాజ్, ఉత్తరప్రదేశ్ యువత ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీకి మద్దతుగా ఉన్నారని మౌర్య పేర్కొన్నారు. 2027 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్పీ–కాంగ్రెస్ కూటమిపై బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు రాహుల్ గాంధీ నిర్వహించిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. పలు ప్రాంతాల్లో నీరు నిలిచి, బురదతో ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్యార్థులు కార్యక్రమానికి తరలివచ్చారు.

# 51 ఏళ్ల కరువు తీరాలి!



## దేశమే తొలి ప్రాధాన్యం.. పతకం కోసం ప్రాణం పెట్టండి

ఎవరినీ తక్కువగా అంచనా వేయొద్దు

గెలవాలన్న కసితోనే బరిలోకి దిగండి

ప్రపంచకప్ కోసం చివరి వరకు పోరాడండి

భారత హాకీ జట్టుకు 1975 ప్రపంచకప్ విజేతల పిలుపు

చక్ దే ఇండియా




**న్యూఢిల్లీ:** ఐదు దశాబ్దాలకు పైగా సాగుతున్న ప్రపంచకప్ పతక నిరీక్షణకు ఈసారైనా తెరదించాలని భారత హాకీ జట్టుకు 1975 ప్రపంచకప్ హీరోలు అశోక్ కుమార్, అస్లాం షేర్ ఖాన్ పిలుపునిచ్చారు. వ్యక్తిగత రికార్డులు, లక్ష్యాల కంటే దేశం కోసం ఆడాలన్న తపనకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గెలుపే ఏకైక లక్ష్యంగా బరిలోకి దిగి.. చివరి వరకు పోరాడితే 51 ఏళ్ల తర్వాత భారత్ మళ్లీ ప్రపంచకప్ పతకం సాధించగలదని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. భారత పురుషుల హాకీ జట్టు ఇప్పటివరకు ఒక్కసారి మాత్రమే ప్రపంచకప్‌ను గెలుచుకుంది. 1975లో కౌలాలంపూర్‌లో జరిగిన ఫైనల్లో పాకిస్థాన్‌ను 2–1తో ఓడించి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. ఆ మ్యాచ్‌లో 51వ నిమిషంలో అశోక్ కుమార్ కొట్టిన గోల్ భారత హాకీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది.

### 'దేశమే తల్లి'గా భావించి ఆడాం

1975 సెమీఫైనల్లో మలేసియాపై భారత్ తరఫున కీలక గోల్ చేసిన అస్లాం షేర్ ఖాన్.. అప్పటిజట్టులో ఉన్న దేశభక్తి, పట్టుదలనే ప్రస్తుత ఆటగాళ్లు కూడా ప్రదర్శించాలని సూచించారు. 1971 ప్రపంచకప్‌లో కాంస్య పతకం, 1973లో రజత పతకం సాధించిన భారత జట్లలో అశోక్ కుమార్, అస్లాం షేర్ ఖాన్ సభ్యులుగా ఉన్నారు. అయితే స్వర్ణం చేజారిన అనుభవమే 1975లో ఎలాగైనా విజేతగా నిలవాలన్న కసిని మరింత పెంచింది. '1971లో సెమీఫైనల్లో ఓడినప్పుడు కోచ్ బల్బీర్ సింగ్ సీనియర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. దేశం కోసం గెలవాలన్న తపన ఎంత తీవ్రంగా ఉండేదో అప్పుడే అర్థమైంది. 1973లో రజతం సాధించినా స్వర్ణం చేజారిందన్న బాధ వెంటాడింది' అని అశోక్ గుర్తుచేసుకున్నారు.

> గెలుపు, ఓటమి మీది కాదు.. దేశానిది అని భావించండి. అదే భావన మిమ్మల్ని మరింత ప్రేరేపిస్తుంది. 51ఏళ్ల నిరీక్షణ చాలా ఎక్కువైంది. ఇప్పుడు మనం తప్పక పతకం గెలవాలి.
>
> — అశోక్ కుమార్

> మేం ప్రపంచకప్‌లోకి అడుగుపెట్టినప్పుడు దేశాన్ని తల్లిగా భావించాం. అదే భావనతో ఆడాం. మీరు కూడా దేశం కోసం బరిలోకి దిగుతున్నామన్న ఆలోచనతో ఆడాలి. ఎట్టి పరిస్థితుల్లోనైనా గెలవాలన్నంత పట్టుదల ఉండాలి.
>
> — అస్లాం షేర్ ఖాన్

### ఎవరూ మనకంటే గొప్ప కాదు

కౌలాలంపూర్ ప్రపంచకప్‌కు ముందు చండీగఢ్‌లో నిర్వహించిన శిబిరంలో దేశం నలుమూలల నుంచి వచ్చిన ఆటగాళ్లు ఒకే లక్ష్యంతో కలిసి సాధన చేశారని అస్లాం తెలిపారు. జర్మనీ, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా వంటి అగ్రశ్రేణి జట్లకంటే తాము ఏమాత్రం తక్కువ కాదన్న నమ్మకమే 1975 జట్టుకు బలంగా నిలిచిందన్నారు. 'ఈ ఆత్మవిశ్వాసం ప్రస్తుత జట్టుకూ అవసరం. అదే స్థాయి పట్టుదల, దేశం కోసం ఆడాలన్న తపన ఉంటే ఈ జట్టును ఎవరూ ఆపలేరు' అని ఆయన చెప్పారు.

### అవకాశం రాక.. కన్నీళ్లే

1975 ప్రపంచకప్‌లో ఎక్కువ సమయం బెంచ్‌పైనే కూర్చోవాల్సి రావడం తనను తీవ్రంగా బాధించిందని అస్లాం గుర్తుచేసుకున్నారు. 'ఆడే అవకాశం రాక ప్రతి రాత్రీ నిద్రకు ముందు కన్నీళ్లు వచ్చేవి. రెండు వారాల ఆ బాధే చివరికి సెమీఫైనల్లో చివరి 15 నిమిషాల్లో గోల్ కొట్టే పట్టుదలగా మారింది' అని ఆయన చెప్పారు.

### ఒలింపిక్స్ వేరు.. ప్రపంచకప్ వేరు

టోక్యో 2021, పారిస్ 2024 ఒలింపిక్స్‌లో భారత్ వరుసగా కాంస్య పతకాలు సాధించినప్పటికీ.. ప్రపంచకప్ ఒత్తిడి, ప్రాధాన్యం వేర్వేరని అస్లాం అన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో ప్రదర్శించిన పోరాట స్ఫూర్తినే ప్రపంచకప్‌లోనూ కొనసాగిస్తే భారత జట్టు పతకంతో తిరిగి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మైదానంలో పరిస్థితులకు అనుగుణంగా ఆటగాళ్లు వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని అశోక్ కుమార్ సూచించారు. బంతిపై నియంత్రణ, అటాకింగ్, బాల్ హ్యాండ్లింగ్, పాసింగ్ వంటి అంశాల్లో ప్రతి నిర్ణయాన్ని త్వరగా తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. 'హాకీ టీమ్ గేమ్. ప్రతి ఆటగాడూ కీలకమే. ముఖ్యంగా ఫార్వర్డ్లు అసాధారణంగా రాణించాల్సిన అవసరం ఉంది' అని అశోక్ పేర్కొన్నారు.

### ఆగస్టు 15 నుంచి ప్రపంచకప్

నెదర్లాండ్స్, బెల్జియం వేదికలుగా ఆగస్టు 15 నుంచి 30 వరకు ప్రపంచకప్ జరగనుంది. 51 ఏళ్ల తర్వాత ప్రపంచకప్ పతకం సాధించాలన్న లక్ష్యంతో హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు బరిలోకి దిగనుంది. 1975 విజేతల స్ఫూర్తితో.. దేశం కోసం చివరి వరకు పోరాడి ఈసారైనా పతక కరువుకు తెరదించాలన్న పట్టుదలతో భారత జట్టు సిద్ధమవుతోంది.

# ఆపరేషన్ ఫిట్‌నెస్!

- వరుస గాయాలపై బీసీసీఐ సీరియస్
- సీఓఈను సందర్శించనున్న కార్యదర్శి దేవజిత్ సైకియా
- క్రికెట్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో కీలక భేటీ
- ఆటగాళ్ల పునరావాసం, గాయాల నిర్వహణపై సమగ్ర సమీక్ష

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టును వరుస గాయాలు వేధిస్తున్న నేపథ్యంలో బీసీసీఐ అప్రమత్తమైంది. కీలక ఆటగాళ్లు ఒక్కొక్కరుగా గాయాల బారిన పడుతుండటంతో ఆటగాళ్ల గాయాలు, చికిత్స, పునరావాసం, ఫిట్‌నెస్ నిర్వహణపై సమగ్ర సమీక్షకు సిద్ధమైంది. ఇందులో భాగంగా బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఆదివారం బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)ను సందర్శించనున్నారు. అక్కడ క్రికెట్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్‌తో సమావేశమై ప్రస్తుత పరిస్థితిపై చర్చించనున్నారు. ఆటగాళ్లకు అందుతున్న చికిత్స, పునరావాస ప్రక్రియ, ఫిట్‌నెస్ అంచనాలతో పాటు గాయాల నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలను సమీక్షించే అవకాశం ఉంది.

### కీలక ఆటగాళ్లు దూరం

ప్రస్తుతం పలువురు కీలక ఆటగాళ్లు గాయాలతో జట్టుకు దూరంగా ఉండటం బీసీసీఐకి ఆందోళన కలిగిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా మోకాలి వాపుతో బాధపడుతుండగా.. సాయి సుదర్శన్ ఎడమ పాదం బొటనవేలు గాయంతో అందుబాటులో లేడు. హర్షిత్ రాణా, నితీశ్ కుమార్ రెడ్డి హ్యామ్‌స్ట్రింగ్ గాయాలతో బాధపడుతున్నారు. వాషింగ్టన్ సుందర్ క్వాడ్రిసెప్స్ గాయంతో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు బెంగాల్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్ ఓటమి అనంతరం ఆకాశ్‌దీప్ వెన్ను కింది భాగంలో స్ట్రెస్ ఫ్రాక్చర్‌కు గురయ్యాడు. దీంతో ఆటకు దూరంగా ఉన్నాడు.

### పెరుగుతున్న ఒత్తిడి

వైట్‌బాల్ క్రికెట్‌లో కీలక ఆటగాళ్లైన హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్ కూడా ప్రస్తుతం సీఓఈలో చికిత్స, పునరావాసం పొందుతున్నారు. హార్దిక్ క్వాడ్రిసెప్స్ గాయంతో.. వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్ హ్యామ్‌స్ట్రింగ్ గాయాలతో కోలుకుంటున్నారు. దీంతో ఆటగాళ్ల గాయాల నిర్వహణ విషయంలో సీఓఈలోని స్పోర్ట్స్ సైన్స్ విభాగంపై ఒత్తిడి పెరిగింది. అంతేకాకుండా 2025 ఆరంభంలో నితిన్ పటేల్ రాజీనామా చేసిన తర్వాత ఈ విభాగానికి పూర్తిస్థాయి అధిపతి లేకపోవడం కూడా సవాలుగా మారింది.

### సమన్వయంపై సందేహాలు

ఆటగాళ్ల ఫిట్‌నెస్, గాయాల నుంచి కోలుకునే వ్యవధిపై సీఓఈ, సెలక్షన్ కమిటీ మధ్య సమన్వయంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బుమ్రా, సాయి సుదర్శన్‌లను ఫిట్‌నెస్ ఆధారంగా జట్టులోకి ఎంపిక చేసినప్పటికీ.. సీఓఈ నిపుణులు ముందు జాగ్రత్త చర్యగా వారిని ఆడించకూడదని నిర్ణయించారు. ఆటగాళ్లు పూర్తిస్థాయిలో కోలుకునే సమయం విషయంలో ఇరు విభాగాల మధ్య ఎల్లప్పుడూ పూర్తిస్థాయి సమన్వయం ఉండటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిస్థాయి ఫిట్‌నెస్ సాధించకముందే ఆటగాళ్లను సీఓఈ నుంచి విడుదల చేస్తున్నారా అన్న అంశంపైనా చర్చ జరుగుతోంది.

### మారిన అంచనాలు

బుమ్రా, సాయి సుదర్శన్‌లలో కనీసం ఒకరు రెండు టెస్టుల్లో ఒకదానికైనా అందుబాటులో ఉంటారని తొలుత సెలక్షన్ కమిటీకి సమాచారం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే బుమ్రా గాయం తర్వాత మోకాలిలో నీరు చేరడంతో అతడు కోలుకునేందుకు మరింత సమయం అవసరమైంది. సుదర్శన్ రోజుకు సుమారు 75 నిమిషాల పాటు బ్యాటింగ్ చేస్తున్నప్పటికీ.. బొటనవేలు నొప్పి తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లే సమయానికి హర్షిత్ రాణా అధిక బరువుతో ఉండడంపై సెలక్షన్ కమిటీ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు నితీశ్ కుమార్ రెడ్డి తన బౌలింగ్ వేగాన్ని గంటకు 7–8 కిలోమీటర్ల మేర పెంచే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. దీంతో అతడి హ్యామ్‌స్ట్రింగ్, క్వాడ్రిసెప్స్‌పై అదనపు భారం పడినట్లు సమాచారం.

# లంక స్పిన్‌కు 'దేవ్' వ్యూహం!



- గాలెకు ముందే గట్టి కసరత్తు
- బెంగళూరులో లంక పిచ్‌లను పునఃసృష్టించి మరీ సాధన
- వివిధ రకాల స్పిన్నర్లు.. కూకాబురా బంతులతో ప్రాక్టీస్
- తుది జట్టులో చోటుకు మార్గం సుగమం

**బెంగళూరు:** శ్రీలంకతో తొలి టెస్టుకు ముందు భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యాడు. కొలంబోలో ఎస్ఎల్‌సీ ఎలెవన్‌తో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో శతకం బాదడంతో పాటు.. సాయి సుదర్శన్ గాయపడటంతో గాలెలో జరిగే తొలి టెస్టులో పడిక్కల్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు మరింత పెరిగాయి. అయితే ఈ అవకాశం కోసం అతడు ఇప్పుడు మాత్రమే సిద్ధం కాలేదు. శ్రీలంక పర్యటనకు బయలుదేరే ముందే లంక స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా సన్నద్ధమయ్యాడు.

### చిన్ననాటి కోచ్‌తో కలిసి పక్కా ప్లాన్

భారత జట్టుతో శ్రీలంకకు బయలుదేరే ముందు తన చిన్ననాటి కోచ్ మహ్మద్ నసీరుద్దీన్‌తో కలిసి పడిక్కల్ సుదీర్ఘంగా సాధన చేశాడు. శ్రీలంక టెస్టుల్లో ఉపయోగించే కూకాబురా బంతులతో పాటు.. ఎక్కువగా టర్న్ అయ్యే పిచ్‌లను బెంగళూరులో ప్రత్యేకంగా సిద్ధం చేసుకుని సాధన చేశాడు. అక్కడి పరిస్థితులను వీలైనంత దగ్గరగా పునఃసృష్టించి.. శ్రీలంక స్పిన్ బలగాన్ని ఎదుర్కొనేందుకు తన ఆటను సిద్ధం చేసుకున్నాడు. 'కేఎస్‌సీఏ మహారాజా ట్రోఫీ టీ20 తర్వాత దేవదత్ నన్ను సంప్రదించాడు. శ్రీలంక వెళ్లే ముందు రెడ్‌బాల్‌తో సాధన చేయాలని కోరాడు. జట్టులో స్థానం దక్కుతుందా లేదా అనేది అప్పట్లో అతడికి ముఖ్యం కాదు. అవకాశం వస్తే అందుకు సిద్ధంగా ఉండాలన్నదే అతడి లక్ష్యం' అని నసీరుద్దీన్ తెలిపారు.

### మూడు గంటలు.. భిన్నమైన స్పిన్నర్లతో

శ్రీలంకలో స్పిన్నర్లను ఎదుర్కోవడం పెద్ద సవాలుగా భావించిన పడిక్కల్ కోసం బెంగళూరులో ప్రత్యేకంగా పిచ్‌లను సిద్ధం చేశారు. టర్న్ ఎక్కువగా లభించే వికెట్‌పై సాధన చేయడంతో పాటు.. వివిధ ఎత్తులు, యాక్షన్‌లతో బౌలింగ్ చేసే లెఫ్ట్‌ఆర్మ్, ఆఫ్‌స్పిన్నర్లను రప్పించారు. ప్రతిరోజూ దాదాపు మూడు గంటల పాటు స్పిన్నర్లను ఎదుర్కొంటూ పడిక్కల్ తన బ్యాటింగ్ నైపుణ్యాలను పదును పెట్టుకున్నాడు. 2024 నవంబర్‌లో పెర్త్‌లో ఆస్ట్రేలియాతో చివరిసారిగా టెస్టు ఆడిన తర్వాత పడిక్కల్ తన బ్యాటింగ్ టెక్నిక్‌లో కొన్ని కీలక మార్పులు చేసుకున్నాడు. స్టాన్స్‌లో మరింత కిందకు వంగడంతోపాటు.. బంతికి దగ్గరగా ఉండి షాట్లు ఆడటంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాడు. 'టెస్టు స్థాయిలో రాణించేందుకు అవసరమైన టెక్నిక్, సహనం అతడిలో ఎప్పటినుంచో ఉన్నాయి. గత రెండేళ్లలో వాటిని మరింత మెరుగుపర్చుకున్నాడు' అని నసీరుద్దీన్ చెప్పారు.

### దేశవాళీల్లో పరుగుల వరద

దేశవాళీ క్రికెట్‌లో పడిక్కల్ గత సీజన్‌లో అద్భుతమైన ఫామ్ కనబరిచాడు. ఆరు మ్యాచ్‌ల్లో 543 పరుగులు చేసి 60కిపైగా సగటు నమోదు చేశాడు. కర్ణాటకకు కెప్టెన్‌గా వ్యవహరించిన నాలుగు మ్యాచ్‌ల్లోనే 428 పరుగులు, 85 సగటుతో రెండు శతకాలు సాధించాడు. పంజాబ్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో కేవలం 85 బంతుల్లోనే 120 పరుగులు చేసి కర్ణాటకకు విజయాన్ని అందించాడు.

### అవకాశాన్ని అందిపుచ్చుకుంటాడా?

ఇప్పుడు గాలె టెస్టులోనూ అదే ప్రశాంతత, పట్టుదలతో ఆడాల్సిన సమయం పడిక్కల్‌కు వచ్చింది. సాయి సుదర్శన్ గాయం కారణంగా తలుపుతట్టిన ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటే.. రెండేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి అతడి పునరాగమనం ప్రత్యేకంగా మారనుంది. ఇప్పటికే లంక స్పిన్‌ను ఎదుర్కొనేందుకు ప్రత్యేకంగా చేసిన సాధన.. గాలెలో అతడికి ఎంతవరకు ఉపయోగ పడుతుందో చూడాలి.

### కెప్టెన్సీతో మరింత పరిణతి

కర్ణాటకకు కెప్టెన్‌గా వ్యవహరించడం కూడా పడిక్కల్‌లో మరింత పరిణతిని తీసుకొచ్చిందని నసీరుద్దీన్ అభిప్రాయపడ్డారు. నిర్ణయాలు తీసుకునే విషయం లో అతడు మరింత మెరుగయ్యాడని చెప్పారు. 'కెప్టె న్సీ ఒత్తిడిగా అనిపిస్తోందా అని అడిగితే.. బాధ్యత ను ఆస్వాదిస్తున్నానని చెప్పాడు. మైదానం బయటే ఒత్తిళ్లు, అంచనాలను వదిలేసి ఆటపై దృష్టి పెడతా డు' అని వివరించారు.




రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు కొనసాగిస్తే భారత ఎగుమతులపై అమెరికా 100 శాతం వరకు అదనపు టారిఫ్ విధించే అవకాశం ఉందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. అయితే ఈ సుంకం భారత్‌పై ఆటోమేటిక్‌గా అమల్లోకి రాదని స్పష్టం చేసింది. రష్యా ఆంక్షలకు సంబంధించిన 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్–2026'కు అమెరికా సెనేట్ ఆగస్టు 7న 86–11 ఓట్లతో ఆమోదం తెలిపింది. బిల్లు ఇప్పుడు ప్రతినిధుల సభకు వెళ్లనుంది. చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల తర్వాత కూడా రష్యా నుంచి చమురు లేదా సహజవాయువు కొనుగోలు చేస్తూ.. రష్యా చమురు దిగుమతిదారుల్లో తొలి ఐదు దేశాల్లో ఉంటే ఆ దేశాల వస్తువులపై 100% వరకు అదనపు సుంకం విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. చైనా, భారత్, స్లోవేకియా, హంగేరీ, అజర్‌బైజాన్‌లను తొలి ఐదు దేశాలుగా బిల్లు రూపకర్తలు గుర్తించారు. ఈ సుంకాలు ఇప్పటికే ఉన్న ఇతర డ్యూటీలకు అదనంగా ఉండే అవకాశం ఉంది.



# ఆస్ట్రేలియాకు 18 టన్నుల మిథిలా మఖానా

- బిహార్ నుంచి సముద్ర మార్గంలో తొలి భారీ ఎగుమతి

న్యూఢిల్లీ: బిహార్ నుంచి 18 టన్నుల మిథిలా మఖానాను సముద్ర మార్గంలో ఆస్ట్రేలియాకు భారత్ ఎగుమతి చేసినట్లు కేంద్ర వాణిజ్య శాఖ శనివారం వెల్లడించింది. దర్భంగా జిల్లాకు చెందిన మఖానా రైతుల నుంచి సేకరించిన ఈ సరుకును ఆస్ట్రేలియాకు పంపినట్లు తెలిపింది. ఈ ఎగుమతితో బిహార్‌కు చెందిన జీఐ ఉత్పత్తి మిథిలా మఖానాకు అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత గుర్తింపు లభించడంతో పాటు రైతులకు మెరుగైన ఆదాయ అవకాశాలు ఏర్పడతాయని పేర్కొంది. దేశంలో మఖానా ఉత్పత్తిలో బిహార్ వాటా 85శాతంగా ఉంది. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు 2025 జులై నుంచి మఖానాకు ప్రత్యేక హెచ్ఎస్ (హార్మనైజ్డ్ సిస్టమ్) కోడ్ అమల్లోకి వచ్చింది.

### 20కిపైగా దేశాలకు ఎగుమతులు

2025–26 ఆర్థిక సంవత్సరంలో భారత్ 7,000 మెట్రిక్ టన్నులకు పైగా మఖానా, విలువ ఆధారిత మఖానా ఉత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా, మధ్యప్రాచ్యం, ఆఫ్రికా సహా 20కిపైగా అంతర్జాతీయ గమ్యస్థానాలకు వీటిని పంపినట్లు వాణిజ్య శాఖ తెలిపింది.

# రేమండ్‌కు రూ.628 కోట్ల ఆదాయం

**ముంబై:** రేమండ్ లిమిటెడ్ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన పనితీరు కనబరిచింది. కంపెనీ మొత్తం ఆదాయం గతేడాది ఇదే కాలంలోని రూ.555 కోట్ల నుంచి 13 శాతం పెరిగి రూ.628 కోట్లకు చేరింది. ఎబిట్డా 14 శాతం వృద్ధితో రూ.100 కోట్లకు చేరగా, మార్జిన్ 15.7 శాతం నుంచి 15.9 శాతానికి పెరిగింది. అసాధారణ అంశాలకు ముందు పన్నుకు ముందు లాభం 38 శాతం పెరిగి రూ.42 కోట్లకు చేరింది. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ విభాగం ఆదాయం 40.4 శాతం పెరిగి రూ.123 కోట్లకు, ఎబిట్డా 25.4 శాతం వృద్ధితో రూ.26 కోట్లకు చేరింది. పరిశోధన, అభివృద్ధి పెట్టుబడుల కారణంగా ఎబిట్డా మార్జిన్ 23.7 నుంచి 21.2 శాతానికి తగ్గింది.

### ఆటో కాంపోనెంట్లలో భారీ వృద్ధి

ప్రెసిషన్ టెక్నాలజీ అండ్ ఆటో కాంపోనెంట్స్ విభాగం ఆదాయం 11.5 శాతం పెరిగి రూ.444 కోట్లకు చేరింది. ఎబిట్డా 45.5 శాతం వృద్ధితో రూ.61 కోట్లకు చేరగా, మార్జిన్ 10.6 నుంచి 13.8 శాతానికి మెరుగుపడింది. ఎగుమతుల పెరుగుదల, మెరుగైన ఉత్పత్తి మిశ్రమం, వ్యయ నియంత్రణ చర్యలు ఇందుకు దోహదపడ్డాయి. జూన్ 2026 నాటికి రేమండ్ రుణ రహిత స్థితిని కొనసాగిస్తూ రూ.129 కోట్ల నికర నగదు మిగులును కలిగి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రీన్‌ఫీల్డ్ ప్లాంట్ పనులు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయని కంపెనీ చైర్మన్, ఎండీ గౌతమ్ హరి సింఘానియా తెలిపారు. ప్రపంచ డిమాండ్‌కు అనుగుణంగా అధిక మార్జిన్ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడమే లక్ష్యమన్నారు.



# సైన్స్ ఫిక్షన్ స్టోరీలో ప్రియాంక చోప్రా

భాషతో సంబంధం లేకుండా వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ, తనదైన నటనతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్న అందాల తార ప్రియాంక చోప్రా ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. సినిమాలతో పాటు అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటూ అభిమానులను అలరిస్తోంది. ఇటీవల 'ది బ్లఫ్' అనే యాక్షన్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఆమె.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన కథతో తెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రియాంక చోప్రా, హాలీవుడ్ ప్రముఖ నటుడు రస్సెల్ క్రో ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త చిత్రం 'బ్లూప్లై'. 'స్ట్రేంజర్ థింగ్స్' ఫేమ్ నిమ్రోడ్ అంటాల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన విషయాన్ని ప్రియాంక తాజాగా సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా వెల్లడించింది. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమా కథ ఆసక్తికరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఉనికిలో లేని ఓ విమానాన్ని తిరిగి తీసుకురావడానికి చేపట్టే ఓ రహస్య మిషన్ చుట్టూ కథ సాగుతుందని చిత్ర సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ మిషన్‌లో ఎదురయ్యే అనూహ్య పరిణామాలు, సవాళ్లు, ఉత్కంఠభరితమైన సంఘటనలతో సినిమా సాగనున్నట్లు సమాచారం. విభిన్నమైన కథాంశంతో పాటు హాలీవుడ్ నటుడు రస్సెల్ క్రోతో కలిసి ప్రియాంక నటిస్తుండటం ఈ చిత్రంపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ ఏడాది చివర్లో 'బ్లూప్లై' చిత్రీకరణను ప్రారంభించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రియాంక చోప్రా మరో భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'లో నటిస్తోంది. మహేశ్‌బాబు ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్‌లో ఆమె పాల్గొంటోంది. ఒకవైపు భారతీయ చిత్రాల్లో నటిస్తూనే మరోవైపు హాలీవుడ్ ప్రాజెక్టులను కొనసాగిస్తూ అంతర్జాతీయ నటిగా తన ప్రయాణాన్ని మరింత విస్తరిస్తోంది ప్రియాంక.

# 'వారణాసి' వీడియో లీక్!

దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న వారణాసి సినిమాకు లీకులు బెడద ఎక్కువగానే ఉంటున్నది. ఈ సినిమా కోసం భారీ సెట్స్ వేసి.. పకడ్బందీగా సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పటికీ.. ఈ సినిమా కోసం షూట్ చేస్తున్న కీలక సన్నివేశాలను కొందరు నెటిజన్లు సోషల్ మీడియా లో పోస్టు చేసి లీక్ చేస్తున్నారు. ఈ లీకుల బెడదతో చిత్ర నిట్ ఆందోళనకు గురి అవుతున్నట్టు సమా చా రం. గతం లో డా ఈ సినిమాకు సంబంధించిన కొన్ని ఫోటోలు, వీడియోలు మీడియాలో లీక్ అయ్యాయి. అయితే తాజాగా 20 సెకన్ల నిడివి ఉన్న ఓ సన్నివేశాన్ని కొందరు లీక్ చేయడంతో ఆ విషయం సోషల్ మీడియాలో ట్రెండింగ్గా మారింది. దర్శకుడు రాజమౌళి తన సినిమా షూటింగ్ స్పాట్‌ను అన్ని రకాలుగా దిగ్బంధం చేస్తారు. లోపలి విషయాలు బయటకు పొక్కకుండా సాంతికంగా చాలా జాగ్రత్తలు తీసుకొంటారు. సినిమా కోసం పనిచేసే ప్రతీ ఒక్కరి నుంచి లీక్‌లు చేయకుండా అగ్రిమెంట్స్ రాయించుకొంటారు. ఎదైనా విషయాన్ని బయటకు లీక్ చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడమనే పాయింట్‌తో డిన అగ్రిమెంట్‌పై సంతకాలు డా చేయించుకొంటారు. అయినా ఆయన షూటింగ్‌లకు సంబంధించిన లీకుల బెడద తప్పకపోవడం ఆందోళనకరంగా మారింది. వారణాసి సినిమా షూటింగును ఒడిశాలోని ఓ మారువల ప్రాంతంలో చిత్రీకరించారు. అయితే కెమెరాకు అందని దూరంలో ఉన్న సన్నివేశాలను షూట్ చేసి వాటిని కొందరు లీక్ చేశారు. ఇక ఈ సినిమా గ్లింప్స్ రిలీజ్ సమయంలో రామోజీ ఫిలిం సిటీలో పకడ్బందీగా ఏర్పాటు చేసిన వేదిక నుంచి దొంగచాటుగా షూట్ చేసి లీక్ చేశారు. గ్లింప్స్‌ను అధికారికంగా రిలీజ్ చేయడానికి ముందే అది సోషల్ మీడియాలో విడుదల కావడం షాకిచ్చింది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన 20 సెకన్ల వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నదనే సమాచారం మరోసారి భారీ షాక్‌కు గురి చేసింది. కొందరు ఈ క్లిప్పింగ్ గురించి సోషల్ మీడియాలో మాట్లాడుతూ.. రక్తంతో రాసిన కథ. దానిని సిరాతో ముందుకు తీసుకెళ్లలేం. ముందుకు వెళ్లాలంటే రక్తమే



అడుగుతుంది అనే డైలాగ్స్ ఉన్నట్టు నెటిజన్లు షేర్ చేసుకొంటున్నారు. మహేష్ బాబు షర్ట్ లేకుండా.. రక్తంలో తడిచిన వీడియో ఫ్యాన్స్‌కు ట్రీగా మారినట్టు తెలుస్తున్నది. అయితే ఈ వీడియోను ఎక్కువగా ప్రచారం జరుగకుండా తొలగించే ప్రయత్నాలు వేగవంతం చేసినట్టు తెలిసింది.

# విడుదలైన 'ది ప్యారడైజ్' టీజర్

టాలీవుడ్ హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమా నుంచి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్ విడుదలైంది. షూటింగ్ చివరి దశకు చేరుకున్న వేళ వచ్చిన ఈ టీజర్ సోషల్ మీడియాలో మంచి స్పందన అందుకుంటోంది. టీజర్‌లో నాని ఇప్పటివరకు కనిపించని మాస్ లుక్‌లో కనిపించారు. యాక్షన్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను మరింత పెంచేలా ఉన్నాయి. చేతి నిండా బ్లేడ్లు పట్టుకుని కనిపించే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'దిష్టంతా పోవాలే' అంటూ నాని చెప్పిన డైలాగ్ అభిమానులను బాగా ఆకట్టుకుంటోంది. టీజర్‌కు అనిరుధ్ అందించిన నేపథ్య సంగీతం మరో హైలెట్‌గా నిలిచింది. ప్రతి యాక్షన్ సీన్‌కు తగ్గట్టుగా వచ్చిన బీజీఎం టీజర్‌కు మరింత బలం తీసుకొచ్చింది. విజువల్స్ డా ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో నాని సరసన కాయాదు లోహర్ కథానాయికగా నటిస్తున్నారు. టీజర్‌కు వస్తున్న స్పందనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'ది ప్యారడైజ్' వచ్చే నెల 24న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఓటీటీలోకి జన నాయగన్

తమిళనాడు ముఖ్యమంత్రి, కోలీవుడ్ సూపర్ స్టార్ దళపతి విజయ్ నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' (తెలుగులో 'జన నాయకుడు'). రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో అడుగుపెట్టడానికి ముందు విజయ్ నటించిన సినిమా కావడంతో, మొదటి నుంచి ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన ఈ సినిమా సెన్సార్ వివాదాలు, తదితర కారణాల వల్ల పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టలకు అన్ని అడ్డంకులను దాటుకుని జూలై 23న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలైంది. మొదటి షో నుంచే మిక్స్‌డ్ టాక్ సొంతం చేసుకున్నప్పటికీ, విజయ్ క్రేజ్ కారణంగా ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద చెప్పుకోదగిన కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పుడీ సినిమా ఓటీటీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అయింది. 'జన నాయగన్' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం 'జీ5' ఫ్యాన్సీ రేటుకు దక్కించుకుంది. లేటెస్ట్ రిపోర్ట్స్ మేరకు, ఈ సినిమా ఆగస్టు 21వ తేదీ నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ తమిళ వెర్షన్‌తో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఒసారి ఈ చిత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలోనే దీనిపై ఓటీటీ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రానుంది. మాస్ చిత్రాల దర్శకుడు హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ యాక్షన్



డ్రామాను వీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ దాదాపు రూ.500 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, మమితా బైజు ఒక ముఖ్యమైన పాత్రలో ఆకట్టుకుంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ పవర్‌ఫుల్ విలన్‌గా మెప్పించారు. వీరితో పాటు ప్రకాష్ రాజ్, ప్రియమణి, గౌతవ్ వాసుదేవ్ మీనన్, నాజర్, నరైన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతం అందించారు.

# అమ్మాయిలు ఇండస్ట్రీకి రావొద్దు

సినీ రంగుల ప్రపంచంలో వెలుగొందాలని.. డబ్బు, పేరు సంపాదించాలని ఎన్నో కలలతో హైదరాబాద్, చెన్నై, ముంబై రైళ్లు ఎక్కేస్తారు యువతీ, యువకులు. అయితే ఇక్కడికి వచ్చాక కానీ ఇండస్ట్రీ లోతు ఎంతో తెలియదు. ప్రతిభ ఉన్నప్పటికీ ఎన్నో అడ్డంకులు, అవరోధాలు, వెనక్కి లాగే వాళ్లను దాటుకుని అవకాశాలు రాబట్టడం అంత సులభం కాదు. ఇక అమ్మాయిలను అవకాశాల పేరుతో ట్రాప్ చేసే క్యాస్టింగ్ కౌచ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండస్ట్రీలో చీకటి కోణాలను ఎందరో నటీనటులు బయటపెట్టారు.కొన్నేళ్ల క్రితం చెలరేగిన మీటూ ఉద్యమం భారతీయ చిత్ర పరిశ్రమను ఒక కుదుపు కుదిపింది. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ఎందరో పెద్ద మనుషుల బాగోతాలు బయటపడ్డాయి. ఇండస్ట్రీలో ఆడవాళ్లకు అవకాశాలు రావాలంటే కమిట్మెంట్ ఇవ్వాల్సిందేనని వర్ధమాన నటీమణులతో పాటు స్టార్ హీరోయిన్లు కూడా చెప్పుకొచ్చారు. తాజాగా సినీరంగంలో క్యాస్టింగ్ కౌచ్ గురించి ఓ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సంచలన వ్యాఖ్యలు చేసింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఈ వివరాల్లోకి వెళితే.ఎవరైనా మన ఇన్‌స్టాగ్రామ్ కానీ, ట్యూబ్ కానీ చూసి మీకు సినిమాలలో ఆఫర్లు ఇస్తాము, ఫోక్ సాంగ్‌లో ఆఫర్ ఇస్తాము, షార్ట్ ఫిల్మ్స్‌లో ఆఫర్ ఇస్తాము, సీరియల్స్‌లో ఆఫర్ ఇస్తాము అంటే నమ్మి ఎగేసుకుని నాలాగా మాత్రం రాకండి. ఎందుకంటే ప్రతివాడు కమిట్‌మెంట్ లేనిదే ఏ ఒక్కడు డా ఏ ఒక్క దానికి అవకాశం ఇవ్వడు అని పక్కా ప్రూవ్ అయ్యింది. నాకు ఒకసారి కాదు ఇది వడోసారి. నాకు సిగ్గు లేదు.. ఫస్ట్ సీరియల్ కోసం పిలిస్తే అలాగే వెళ్లాను, అక్కడ డా ఇదే పంచాయతీ ఉంటే రిటర్న్ వచ్చేశాను. అలాగే సినిమాలో ఆఫర్ వస్తే వెళ్లాను.. సినిమాకి డా అదే రిపీట్ అయ్యింది. మళ్లీ రిటర్న్ వచ్చాను. ఇప్పుడు ఫోక్ సాంగ్ కోసమని ఒకడు పిలిచాడు. సరే కవర్ సాంగ్స్ అయినా చేద్దామని ఒప్పుకుని ఇక్కడికి వస్తే .. వాడు ఉదయం నుంచి ర్చోబెట్టి, మగాడి బుద్ధి ఏంటనేది చూపించాడు. ప్రతివాడు చూసేది అవకాశం ఇస్తాడు, ఇవ్వడనేది కాదు అని ఆ అమ్మాయి చెప్పింది. ఖచ్చితంగా అమ్మాయిలకు 100కి 110 శాతం అవకాశాలు ఉన్నాయి. ఒక మగాడి పక్కన ఆడది పడుకుంటేనే అవకాశాలు ఇచ్చే పరిస్థితి ఉంది హైదరాబాద్‌లో. దయచేసి ఎవరూ గుడ్డిగా నమ్మి రాకండి, నన్ను తప్పుగా అనుకున్నా పర్లేదు. ఒక అమ్మాయి సినీ ఫీల్డ్‌లో సెటిల్ అయ్యిందంటే ఖచ్చితంగా ఒకడి దగ్గర పడుకునే సెటిలైందని పక్కగా నమ్మి చెబుతున్నా. ప్రతి ఒక్కడు ఆడదానిని వాడుకోవాలనే చూస్తాడు.. నాకు తెలిసి ఏ ఒక్క అమ్మాయి కూడా టాలెంట్‌తో ఎదిగిందంటే నేను ఒప్పుకోను. ప్రతివాడు లొంగదీసుకున్నవాడే.. ఎవడో ఒకడి దగ్గర పడుకునే పైకొచ్చింది. లేదంటే మాత్రం ఒక అమ్మాయికి ఆఫర్ రావాలంటే మాత్రం చాలా చాలా కష్టం. నా మీద ఎన్ని నెగిటివ్ కామెంట్స్ పెట్టినా ఓ.. నా బాధ మీతో పంచుకుంటున్నాను అని ఆ యువతి వాపోయింది.





బాలీవుడ్ అగ్రతారలు రణబీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'లవ్ అండ్ వార్'. ప్రముఖ దర్శకనిర్మాత సంజయ్ లీలా భన్సాలీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రొమాంటిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటోంది. రణబీర్, అలియా, విక్కీ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై బాలీవుడ్‌లో ఇప్పటికే భారీగా ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త నెట్టింట్లో చక్కర్లు కొడుతోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న 'లవ్ అండ్ వార్'లోని ప్రధాన పాత్రలకు సంబంధించిన క్యారెక్టర్ పోస్టర్లను విడుదల చేయనున్నట్లు సమాచారం. దీంతో అభిమానులకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రత్యేక కానుక అందనున్నట్లు తెలుస్తోంది. ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ముగ్గురు ప్రధాన పాత్రల మధ్య సంబంధాలు, భావోద్వేగాలు కథకు కీలకంగా ఉండనున్నట్లు సమాచారం. సంజయ్ లీలా భన్సాలీ తనదైన విలాసవంతమైన విజువల్స్, బలమైన భావోద్వేగాలతో ఈ కథను తెరకెక్కిస్తున్నట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న చిత్రీకరణను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది జనవరి 22న 'లవ్ అండ్ వార్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. విడుదల తేదీ, క్యారెక్టర్ పోస్టర్లతో పాటు సినిమా నుంచి మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడయ్యే అవకాశం ఉందని సమాచారం.

# 'బిగ్ బాస్'లోకి సాధనా నాయుడు!?

బిగ్గెస్ట్ రియాలిటీ షోగా పాపులర్ అయిన 'బిగ్ బాస్' ఇప్పుడు పదో వసంతంలోకి అడుగుపెడుతోంది. ఇప్పటి తొమ్మిది సీజన్లను అత్యంత విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రియాలిటీ షో, ఇప్పుడు 'బిగ్ బాస్ 10: దశావతారం' అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ముస్తాబవుతోంది.ప్రతి సీజన్‌లో సినిమా ప్రమోషన్స్, టాలీవుడ్ తారల సందడితో కోలాహలంగా మారే బిగ్ బాస్ వేదిక, ఈసారి పదింతల వినోదాన్ని పంచేందుకు సిద్ధమైంది. బిగ్ బాస్ 10కు సంబంధించి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఎన్నో ఊహాగానాలు బయటకొస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ సారి బిగ్ బాస్ హౌస్ లోకి ఓ హాట్ లేడీ ఎంట్రీ ఇస్తున్నట్లు తెలుస్తోంది.ఆమె



పేరు సాధనా నాయుడు. సోషల్ మీడియాలో తన ప్రత్యేకమైన కంటెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్న ఇన్‌ఫ్లూయెన్సర్లలో ఈమె ఒకరు. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్, ట్రావెల్‌తో పాటు రోజువారీ జీవితానికి సంబంధించిన ఆసక్తికరమైన వీడియోలు, ఫొటోలు పంచుకుంటూ ఆమె సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్‌ను సంపాదించుకున్న ఈ పిల్ల ఇన్‌స్టాగ్రామ్, ట్యూబ్ వంటి వేదికల్లో సందడి చేస్తుంటుంది. డిజిటల్ క్రియేటర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీకి బిగ్ బాస్ ఆఫర్ వచ్చిందని, అందుకు ఆమె అంగీకారం కూడా ఇచ్చిందని టాక్. ఈ పేరు బయటకు రావడంతో ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ కోసం వెతి జనం అమాంతం పెరిగిపోయారు.

# ఆగస్టు 26న 'టాక్సిక్'.. 28న 'హాయ్' విడుదల

లేడీ సూపర్‌స్టార్ నయనతార ఆగస్టు చివరి వారంలో వరుస చిత్రాలతో ప్రేక్షకులను పలకరించబోతోంది. ఆమె నటించిన రెండు విభిన్నమైన సినిమాలు కేవలం రెండు రోజుల వ్యవధిలో థియేటర్లలోకి రానుండటంతో బాక్సాఫీస్ వద్ద ఆసక్తికరమైన పరిస్థితి నెలకొంది. కన్నడ రాకింగ్ స్టార్ యష్ హీరోగా భారీ అంచనాలతో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో నయనతార 'గంగ' అనే కీలకమైన పాత్రలో కనిపించనుంది. భారీ బడ్జెట్, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. 'టాక్సిక్' విడుదలైన రెండు రోజులకే అంటే ఆగస్టు 28న నయనతార కథానాయికగా నటించిన మరో చిత్రం 'హాయ్' థియేటర్లలోకి రానుంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.